ఎమ్మెల్సీపై కూటమి భేటీ

నేడు నోటిఫికేషన్



- 13వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ
- ఉపసంహరణకు 16 వరకూ గడువు
- 30న పోలింగ్
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల కోటాలోని ఎమ్మెల్సీ ఎన్నికకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల కానున్నదని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్‌జారీచేసిన రోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మంగళవారం నుంచి 13వ తేదీ వరకు (ప్రభుత్వ సెలవు దినాలు మినహాయించి) ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఓటర్లుగా ఉంటారన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ ఎన్నికల అధికారిగా, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, మూడు జిల్లాల రెవెన్యూ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. ఈనెల 14న నామినేషన్లు పరిశీలిస్తామన్నారు. నామినేషన్లు ఉపసంహరణకు ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ గడువు ఉంటుందన్నారు. తదుపరి బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటించి బ్యాలెట్ ముద్రణ చేపడతామన్నారు. ఎన్నికల్లో ఈవీఎంలు ఉండవని, కేవలం బ్యాలెట్ పత్రాలు వినియోగిస్తామన్నారు. ఈనెల 30వ తేదీన పోలింగ్ నిర్వహిస్తామని, కేంద్రాల వివరాలను రెండు, మూడు రోజుల్లో వెల్లడిస్తామన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. కోడ్ ఉన్నందున ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయరాదన్నారు. మూడు జిల్లాల్లో రాజకీయ నాయకులు ఏర్పాటుచేసే సమావేశాలకు అధికారులు హాజరుకారాదని స్పష్టంచేశారు. సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ మయూర్ అశోక్, ఇన్‌చార్జి డీఆర్వో సీతారామమూర్తి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికపై సమావేశమైన కూటమి నాయకులు

అభ్యర్థిత్వంపై చర్చ

- పోటీకి నలుగురు సుముఖం
- జాబితాలో గండి బాబ్జీ, పీలా గోవింద్, పీవీజీ కుమార్, తాతయ్యబాబు
- బైరి దిలీప్ చక్రవర్తి పేరు కూడా పరిశీలన
- అధినేతకు ఐదుగురి పేర్లు పంపాలని నిర్ణయం

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి తెలుగుదేశం పార్టీ నుంచి పలువురు నేతలు ఆసక్తి చూపుతున్నారు. ఈ జాబితాలో మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, పీలా గోవింద సత్యనారాయణ, అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాడుగుల ఇన్‌చార్జి పీవీజీ కుమార్ ఉన్నారు. సోమవారం రాత్రి నగరంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇంట్లో కూటమికి చెందిన ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీల బలాబలాలు చర్చించిన నేతలు పోటీ చేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎన్నికలకు అవసరమైన ఖర్చును భరించేందుకు గండి బాబ్జీ, పీలా గోవింద, తాతయ్యబాబు, పీవీజీ కుమార్‌లు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా అధిష్ఠానం సూచన మేరకు అనకాపల్లి ఎంపీ సీటు ఆశించిన బైరా దిలీప్ చక్రవర్తి అభ్యర్థిత్వంపై కూడా సమావేశంలో చర్చించారు. అవసరమైతే క్యాంపులు నిర్వహించా లనే ప్రతిపాదన కూడా వచ్చింది. అభ్యర్థిత్వం ఆశిస్తున్న గండి బాబ్జీ, పీలా గోవింద్, తాతయ్యబాబు, పీవీజీ కుమార్, దిలీప్ చక్రవర్తి పేర్లు అధినేతకు పంపాలని సమావేశం నిర్ణయించింది. పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, పి.విష్ణుకుమార్‌రాజు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీలు బుద్దా నాగజగదీశ్వరరావు, పీఎస్‌వీ మాధవ్, దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శీతంరాజు సుధాకర్, బీజేపీ నగర అధ్యక్షుడు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- ఎమ్మెల్సీ ఎన్నికకు 838 మంది ఓటర్లు
- 10వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరణ
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు 838 మందితో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశామని రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 636 మంది ఎంపీటీసీ సభ్యులు, 36 మంది జడ్పీటీసీ సభ్యులు, 97 మంది కార్పొరేటర్లు, 53 మంది మునిసిపల్ కౌన్సిలర్లు, ఇంకా ఎక్స్‌అఫీషియో సభ్యులు 16 మంది ఓటర్లుగా ఉంటారన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై ఈ నెల 10వ తేదీ వరకూ అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ మంగళవారం విడుదల చేస్తామని, అదేరోజు నుంచి 13వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు ... మిగతా 6వ పేజీలో

హోరాహోరీగా స్థాయీ సంఘం పోరు

- స్టాండింగ్ కమిటీలో పదికి పది స్థానాలు గెలుచుకునేందుకు కూటమి వ్యూహం
- కనీసం ఐదైనా దక్కించుకునేందుకు వైసీపీ యత్నం



- వ్యూహప్రతివ్యూహాల్లో ఇరుపక్షాల నేతలు
- వైసీపీ కార్పొరేటర్లతో నేడు సుబ్బారెడ్డి సమావేశం
- అనంతరం రహస్య ప్రాంతానికి తరలిస్తారని ప్రచారం
- ఎన్నిక రేపు
- పోలింగ్ ఏర్పాట్లు పూర్తిచేసిన జీవీఎంసీ అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): **జీవీఎంసీ స్టాండింగ్ కమిటీకి బుధవారం ఎన్నిక జరగనున్నది. అందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కౌన్సిల్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఇంచుమించు సమానబలం ఉండడంతో ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది.**

స్టాండింగ్ కమిటీలో పది స్థానాలు ఉండగా కూటమి నుంచి పది మంది, వైసీపీ నుంచి పది మంది పోటీలో నిలిచారు. వైసీపీకి చెందిన 12 మంది కార్పొరేటర్లు ఇటీవల టీడీపీ, జనసేనల్లో చేరారు. దీంతో కూటమి బలం ప్రస్తుతం 47కి పెరిగింది. అదే సమయంలో వైసీపీ బలం 48కి తగ్గింది. సీపీఐ, సీపీఎం కార్పొరేటర్ల వైఖరి ఇంకా తేలాల్సి ఉంది. కాగా కౌన్సిల్‌లో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు ఉండడంతో స్టాండింగ్ కమిటీ సభ్యునిగా ఎవరైనా విజయం సాధించాలంటే కనీసం 49 ఓట్లు దక్కించుకోవాల్సి ఉంటుంది. అంటే వైసీపీకి ఒకరు, కూటమికి ఇద్దరు అదనంగా ఓటు వేయాల్సి ఉంటుంది. అయితే వైసీపీ నుంచి మరో ఆరుగురు కార్పొరేటర్లు మంగళవారం టీడీపీ, జనసేన పార్టీల్లో చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అది వాస్తవమైతే కూటమి అభ్యర్థుల విజయం నల్లేరు మీద నడకేనని అభిప్రాయం వ్యక్తమవుతున్నప్పటికీ క్రాస్ ఓటింగ్ భయం కూడా వెంటాడుతోంది. కొత్తగా ఆరుగురు కార్పొరేటర్లు టీడీపీ, జనసేనల్లో చేరుతున్నందున తమ బలం 53కి పెరుగుతుందని, తమలో ఒకరిద్దరు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినా ఇబ్బంది ఉండదని కూటమి నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు వైసీపీ కార్పొరేటర్లు కనీసం ఐదు స్థానాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తంచేస్తున్నారు. తమ పార్టీ నుంచి టీడీపీ, జనసేనలో చేరినవారి కారణంగా ఆయా పార్టీల్లోని కార్పొరేటర్లు కొందరు అసంతృప్తితో ఉన్నారని, వారంతా తమ అభ్యర్థుల్లో కొందరికి మద్దతుగా ఓటేస్తారని చెప్పుకుంటున్నారు. స్టాండింగ్ కమిటీలో కనీసం ఐదు స్థానాలను దక్కించుకోవడమే లక్ష్యంగా వైసీపీ నేతలు వ్యూహరచనలో నిమగ్నమై ఉన్నారు. వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి మంగళవారం ఉదయం పార్టీ కార్పొరేటర్లతో సమావేశం కానున్నట్టు సమాచారం. సమావేశం ముగిసిన వెంటనే కార్పొరేటర్లను రహస్య ... మిగతా 6వ పేజీలో

తిమ్మాపురం వద్ద యూనిటీ మాల్

- రామానాయుడు స్టూడియో సమీపంలో రూ.172 కోట్లతో నిర్మాణం
- చేనేత, చేతివృత్తుల వారికి ప్రోత్సాహం... తద్వారా పర్యాటక అభివృద్ధికి అవకాశం
- స్థల పరిశీలన చేసిన కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర్ ప్రసాద్

సాగర్‌నగర్, ఆగస్టు 5: భీమిలి బీచ్ రోడ్డులో తిమ్మాపురం వద్ద రామానాయుడు స్టూడియో సమీపాన యూనిటీ మాల్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మాల్ నిర్మాణానికి గత బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.172 కోట్లు మంజూరుచేసింది. రాష్ట్రంలో మూలధన పెట్టుబడుల్లో భాగంగా ఏర్పాటుచేసే యూనిటీ మాల్ వల్ల చేనేత, చేతివృత్తుల ఉత్పత్తులకు ప్రోత్సాహం లభిస్తుందని, తద్వారా పర్యాటక రంగం విస్తరిస్తుందని కేంద్రం భావిస్తోంది. ఐదెకరాల విస్తీర్ణంలో చేపట్టనున్న మాల్ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించింది. మాల్ నిర్మాణానికి బిడ్లు, ఇతరత్రా మౌలిక వసతుల కల్పన బాధ్యతను ఏపీఐఐసీకి అప్పగించారు. ఏపీఐఐసీ, మాల్‌కు నోడల్ ఏజెన్సీగా ఉండే చేనేత, జౌళి శాఖల మధ్య ఇప్పటికే ఒప్పందం జరిగింది. గత నెలలో విశాఖపట్నం వచ్చినప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు యూనిటీ మాల్ గురించి ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ సోమవారం మాల్ నిర్మాణానికి సముద్రానికి అభిముఖంగా రామానాయుడు స్టూడియోస్ వద్ద ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. సర్వే మ్యాపును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్ ఉన్నారు.



యూనిటీ మాల్ నిర్మాణం కోసం సోమవారం తిమ్మాపురం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్



రైలు నుంచి మంటలు, పొగలు (ఫైల్ ఫొటో)

రైలు ప్రమాదం వెనుక సిబ్బంది నిర్లక్ష్యం

- ప్లాట్‌ఫారంపై అంతసేపు ఎందుకు ఉంచారు?
- బీ-6, బీ-7లలో గ్యాస్ సమస్య నిజమేనా!!
- సీసీ టీవీ పుటేజీ ఏమి చెబుతోంది?
- స్మోక్ సెన్సార్ల సంగతి ఏమిటి?
- బీ-7 టీటీఈ, ప్రయాణికులను విచారిస్తేనే నిజాలు
- ప్రమాదంపై ఉన్నత స్థాయి విచారణ ప్రారంభం.. విశాఖ చేరుకున్న బృందం

విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆదివారం కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో సంభవించిన అగ్ని ప్రమాదానికి సిబ్బంది నిర్లక్ష్యం కారణమని స్పష్టంగా తెలుస్తోంది. ఈ ఘటనపై అధికారులు ఉన్నతస్థాయి విచారణ చేపట్టారు.

... మెయిన్‌లో

కేజీహెచ్‌లో హైడ్రామా



డాక్టర్ అశోక్‌కుమార్



డాక్టర్ శివానంద

- సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన డాక్టర్ అశోక్‌కుమార్
- డీఎంఈ నుంచి తనకు సమాచారం లేదన్న ప్రస్తుత సూపరింటెండెంట్ శివానంద
- ఆర్డర్స్ వచ్చిన తరువాతే చేరతానంటూ వెళ్లిపోయిన పూర్వపు సూపరింటెండెంట్

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సోమవారం ఉదయం హైడ్రామా నెలకొంది. లైంగిక వేధింపుల ఆరోపణలు, అనంతరం తలెత్తిన పరిణామాల నేపథ్యంలో గత సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ రెండు నెలలపాటు సెలవులో వెళ్లిపోయారు. ఆయన సెలవుపై వెళ్లడంతో పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన డాక్టర్ శివానందకు ఉన్నతాధికారులు అప్పగించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు కొనసాగాలని పేర్కొన్నారు. అయితే, సోమవారం ఉదయం అకస్మాత్తుగా ... మిగతా 6వ పేజీలో

లేఅవుట్లు ఖాళీ

ఎంఐజీ టౌన్‌షిప్‌లకు ఆదరణ కరువు

- ఏడాదిన్నర క్రితం ఆనందపురం మండలంలో నాలుగు లేఅవుట్లు వేసిన వీఎంఆర్‌డీఏ
- పాలవలస లేఅవుట్‌లో 472 ప్లాట్లకుగాను 164 దరఖాస్తులు
- రామవరం, గంగసాని అగ్రహారం-1, 2... మూడింటికి కలిపి కేవలం 29 రాక
- వారికి కూడా పాలవలసలో కేటాయించాలని అధికారుల యోచన



రామవరంలో లేఅవుట్ వేసేందుకు ఎంపిక చేసిన భూములు



పాలవలసలోని లేఅవుట్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మధ్య తరగతి ప్రజల కోసమంటూ ప్రారంభించిన 'ఎంఐజీ టౌన్‌షిప్'కు పెద్దగా ఆదరణ లభించలేదు. విశాఖ జిల్లాలో నాలుగుచోట్ల లేఅవుట్లు వేస్తే కేవలం ఒక్కచోట మాత్రమే ప్రజలు ఆసక్తి చూపించారు. అక్కడ కూడా మొత్తం ప్లాట్లలో నాలుగో వంతు మాత్రమే అమ్ముడయ్యాయి. మిగిలిన చోట్ల ఎక్కడా కనీసం 20 దరఖాస్తులు కూడా రాలేదు. దాంతో వారికి కూడా పాలవలసలోనే ప్లాట్లు కేటాయించాలని అధికారులు భావిస్తున్నారు.

ఎక్కడెక్కడంటే...

2022 డిసెంబరులో ఆనందపురం మండలంలోని మూడు గ్రామాల్లో ఎంఐజీ టౌన్‌షిప్‌లు ప్రకటించారు. రైతుల నుంచి పూలింగ్ విధానంలో భూములు సేకరించి పాలవలస, రామవరం, గంగసాని అగ్రహారం-1, గంగసాని అగ్రహారం-2 పేరుతో లేఅవుట్లు ... మిగతా 6వ పేజీలో

ఏయూలో హాస్టల్ విద్యార్థుల ఆందోళన

- భోజనం, పప్పు రుచిగా లేదంటూ పరిపాలనా భవనం ఎదుట నిరసన
- సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ఇన్‌చార్జి వీసీ
- విద్యార్థులతో మెస్ కమిటీ ఏర్పాటు.. సమస్యలుంటే ఇకపై వార్డెన్ దృష్టికి

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ హాస్టల్ విద్యార్థులు సోమవారం మధ్యాహ్నం పరిపాలనా భవనం ఎదుట ఆందోళన నిర్వహించారు. హాస్టల్‌లో సుమారు 350 మంది ఉంటారు. సోమవారం మధ్యాహ్నం కామన్ మెస్‌లో వడ్డించిన అన్నం గట్టిగా ఉండడంతోపాటు పప్పు రుచిగా లేకపోవడంపై సిబ్బందిని అడిగినా ప్రయోజనం లేకపోవడంతో సుమారు 50 మంది విద్యార్థులు ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌ను కలిసేందుకు వెళ్లారు. అయితే, సిబ్బంది పైకి వెళ్లేందుకు ... మిగతా 6వ పేజీలో



ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న ఏయూ అధికారులు

రైల్వే పర్సనల్ బ్రాంచిలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

విశాఖపట్నం, ఆగస్టు 5: వాల్తేరు రైల్వే పర్సనల్ బ్రాంచి రిక్రియేషన్ క్లబ్ (పీబీఆర్‌సీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా క్లబ్ ప్రతినిధులు సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ కార్యాలయంలో జరిగిన ఈ శిబిరంలో 50 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్, పీబీఆర్‌సీ కన్వీనర్ రంజన్ మొహంతి మాట్లాడుతూ, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంకు సమన్వయంతో నిర్వహించిన ఈ శిబిరంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రక్తదాతలను అభినందించారు. క్లబ్ ప్రతినిధులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ ఏ వెంకటేశ్వరరావు, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, పీబీఆర్‌సీ కార్యదర్శి ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలతోనే రోడ్డు ప్రమాదాలకు చెక్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ముంబై సంస్థ ప్రతినిధి

కంచరపాలెం, ఆగస్టు 5 : ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా ఉండగలమని యునైటెడ్ వే ముంబాయి సంస్థ ప్రతినిధులు సూచించారు. రహదారి భద్రతపై ఆర్పీపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలను వివరించారు. వివిధ స్లైడ్స్ ప్రదర్శించారు. తొందరపాటుతో రోడ్డు దాటకూడదని, జీబ్రా క్రాసింగ్‌లో మాత్రమే నడవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నియమాలు, సిగ్నల్స్‌పై అవగాహన కలిగించారు. స్కూల్ హెచ్‌ఎం ఆర్. శ్రీనివాసరావు, జీవీ జగన్నాధరావు,పి.వెంకటేశ్వరరావు. కె.సత్యనారాయణతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బ్రహ్మకుమారీస్ సేవలు అభినందనీయం'

డాబాగార్డెన్స్, ఆగస్టు 5: బ్రహ్మకుమారీ సంస్థ అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు అభినందనీయమని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో సెప్టెంబర్ 26 నుంచి రాజస్థాన్‌లో బ్రహ్మకుమారీస్ నిర్వహించనున్న మీడియా సదస్సుకు సంబంధించిన వివరాలను సంస్థ ప్రతినిధి రామేశ్వరి తెలిపారు. ఈ సదస్సులో ఆరోగ్యం, ఆధ్యాత్మికత, ధ్యానం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని నగరంలోని పాత్రికేయులు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో బ్రహ్మకుమారీస్ సభ్యులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు ప త్రాలందిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 5 : గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారు ఎదుట వార్డు జనసేన అధ్యక్షుడు తుమ్మల త్రినాద్ ఆధ్వర్యంలో పార్టీ నాల్గో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సుమారు 500 మందికి పైగా సభ్యత్వం తీసుకున్నట్టు ఆయన చెప్పారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉత్తరం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ త్రినాధ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీలా హరిప్రసాద్, బండి రాజు, కనకరాజు, రత్నం, మేరా నాయుడు, శేఖర్ పాల్గొన్నారు.

జీవీఎంసీ స్థలం ఆక్రమణ

- టర్నర్ చౌల్ట్రీ వద్ద కబ్జా
- దశాబ్దాల కిందట జనాల అవసరాలకు మునిసిపాలిటీ కొనుగోలు?
- ప్రస్తుతం ఓ వ్యాపారి చెరలో ..
- మిన్నకుంటున్న యంత్రాంగం



టర్నర్‌చౌల్ట్రీ మెయిన్ రోడ్డు అనుకుని జీవీఎంసీ స్థలంలో వ స్త్ర దుకాణం



రాత్రివేళలో పరదాలు కప్పిన దృశ్యం

జగదాంబ కూడలి, ఆగస్టు 3: టర్నర్ చౌల్ట్రీ మెయిన్ రోడ్డు పుట్‌పాత్‌ను అనుకుని ఉన్న జీవీఎంసీ స్థలం ఆక్రమణకు గురైంది. స్థానిక నివాసితుల రస్తాగా గల ఈ స్థలం పుట్‌పాత్ వ్యాపారి చెరలో ఉంది. ప్రజావసరాల కోసం విశాఖ మునిసిపాలిటీగా ఉన్న సమయంలో ఈ స్థలాన్ని అప్పటి అధికారులు కొనుగోలు చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. కొనేళ్లుగా పుట్‌పాత్ వ్యాపారి ఈ స్థలాన్ని తనస్వాధీనంలోకి తెచ్చుకున్నట్టు స్థానిక సాలిపేట, తాడి ప్రాంతాలకు చెందిన సీనియర్ సిటిజన్స్, రోడ్డు పక్కన షాపు యజమానులు ఆరోపిస్తున్నారు. నాలుగు దశాబ్దాల కిందటి వరకు ఈ స్థలంలో రాకపోకలు సాగేవని, రాత్రివేళలో అప్పట్లో జనసంచారం తక్కువగా ఉండడం, అసాంఘిక కార్యకలాపాలకు ఈ స్థలం ఆసరాగా మారింది. ఈ స్థితిలో స్థానికులు కొందరు ఓ పూల మొక్కలు అమ్మకందారునికి జనానికి ఇబ్బందిలేకుండా ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పుట్‌పాత్ విక్రయాలు పెరుగుతున్న క్రమంలో టర్నర్ చౌల్ట్రీ ఎదుట వ్యాపారం చేస్తున్న ఓ వస్త్ర వ్యాపారికి కొంత మేర ఈ స్థలంలో అవకాశం కల్పించారు. తదనంతరం మొక్కలు వ్యాపారి మృతి చెందడంతో ఈ స్థలం పూర్తిగా సొంతం చేసుకునేందుకు ఆ వస్త్ర వ్యాపారి కన్నేశారు. రహదారి కోసం జీవీఎంసీ ఏర్పాటు చేసిన స్థలంలో పుట్‌పాత్ వ్యాపారి చుట్టూ పరదాలు కట్టి అక్కడ స్థలం ఉందన్న ఆనవాలు లేకుండా చేస్తున్నారు. క్రమేపీ ఆక్రమణదారుడు దీనిని తమ సొంత స్థలంగా చలామణీలోకి తీసుకువచ్చారు. మొక్కల వ్యాపారిదిగా ఈ స్థలాన్ని పేర్కొంటూ తాను అద్దెకు ఇస్తున్నట్టు ప్రచారం సాగిస్తుండడంతో స్థానికులు మండిపడుతున్నారు. రూ. లక్షల్లో విలువ చేసే జీవీఎంసీ స్థలం ఆక్రమణకు లోనైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడడంలేదు. స్థలం ఆక్రమణదారుమెల్లమెల్లగా ఈ స్థలంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు రంగం సిద్ధమవుతున్నట్టు వ్యాపార వర్గాలు ఆరోపిస్తున్నాయి. వన్‌టౌన్ రోడ్డు విస్తరణ సమయం లోనూ టౌన్ ప్లానింగ్ అధికారులుఈ కబ్జాను గుర్తించలేదు. జీవీఎంసీ స్థలంలో పుట్‌పాత్ వ్యాపారాలకు అనుమతి ఇస్తూ అద్దె వసూలు చేయ డం సరికాదని అంటున్నారు.

ఆక్రమణదారులను ఉపేక్షించం
- జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ప్రసాద్

జీవీఎంసీ 30వ వార్డు టర్నర్ చౌల్ట్రీ మెయిన్ రోడ్డు పెట్రోల్ బంకు ఎదురుగా రహదారిని ఆక్రమించిపుట్‌పాత్ వ్యాపారం నిర్వహించే వారి విషయంలో ఉపేక్షించేది లేదు. గతంలో మునిసిపాలిటీ స్థలాన్ని ఆక్రమించి వ్యాపారం చేస్తున్నట్టు టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్ధారిస్తే తక్షణం దుకాణాలను తొలగిస్తాం.

ఇసుక కుప్పలు తొలగించరూ..



టీపీటీ కాలనీలో రహదారికి అడ్డంగా ఉన్న ఇసుక

సీతమ్మధార, ఆగస్టు 5: గ్రేటర్ 24వ వార్డు టీపీటీ కాలనీలో భవన నిర్మాణానికి సంబంధించిన ఇసుక కుప్పలను రోడ్డుపై వేసి వదిలేయడంతో రాకపోకలకు ఇ బ్బందులు ఎదురవుతున్నాయి. క్రిసెంట్ టవర్స్ వెనుక రోడ్డు అభయాంజనేయ స్వామి ఆలయం ఎదుట గల ఈ రహదారిలో ఓ ఇంటి నిర్మాణ యజమాని ఇసుక కుప్పలుగా వేసి వాటిపై గోనె సంచులతో కప్పి ఆక్రమించారు. దీంతో అటుగా రాకపోకలు సాగించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సుమారు 20 అడుగుల ఎత్తున ఇసుకనిల్వ చేయడంతో నడవడానికి సైతం సమస్యగా మారింది. దీంతో వాహనదారులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. జీవీఎంసీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా స్పందించి ఇసుక కుప్పలు తొలగించాలని కోరుతున్నారు.

తెలుకుల, గాండ్ల వర్గాలకు తోడ్పాటునందించాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్



సమావేశంలో మాట్లాడతున్న రవికుమార్

మహారాణిపేట, ఆగస్టు 5: గాండ్ల, తెలుకల సామాజిక వర్గం ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పెబ్బిలి రవి కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మహారాణిపేట దండుబజారు వద్ద ఉన్న గాండ్ల సామాజిక వర్గ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఢిల్లీలో అఖిల భారత తెలిసాహు మహాసభ జాతీయ సమావే శానికి రాష్ట్ర ప్రతినిధిగా హాజరైనట్టు చెప్పారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో గాండ్ల సామాజిక వర్గ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరామన్నారు. రాజకీయంగా నామినేటెడ్ పదవులు తమకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా అధ్య క్షుడు దాడి సత్యనారాయణ, కన్వీనర్ ఎన్నేటి తాతారావు, చిత్రాడ అప్పా రావు, పేరూరి గణేశ్వరరావు, ఎన్నేటి సన్యాసిరావు, లక్ష్మణకుమార్ సతీష్ పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలి

- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి



ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ పీవో జయదేవి, అంగన్‌వాడీలు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నవజాత శిశువులకు ఆరు నెలలపాటు తల్లిపాలను తప్పనిసరిగా అందించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వి. జయదేవి పేర్కొన్నారు. సోమవారం ఆశీల్‌మెట్ట వద్ద అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలనుద్దేశించి మాట్లాడారు. తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగు తుందన్నారు. అనంతరం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. ఇందిరాదేవి, మెడికల్ ఆఫీసర్ మనోరమ, హెచ్‌వీ పూర్ణకుమారి, సచివాలయ ఎం ఎస్‌కేలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విశాఖపట్నం: తల్లిపాలపై అపోహలు విడాలని ఘోషాసుపత్రి వైద్య నిపుణులు సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆస్పత్రిలో బాలింతలు, నర్సింగ్ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యకమంలో ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ రాధారాణి, చి న్న పిల్లల వైద్యనిపుణులు చంద్రశేఖర్, నర్సింగ్ సిబ్బంది, బాలింత లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండ్లను పంపిణీ చేశారు.

మాధవధార; గ్రేటర్ 49వవార్డు పట్టాభిరెడ్డితోట సత్యానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్త రేణుక మాట్లాడుతూ. పోషకాహారం తీసుకోవడంపై శ్రద్ధ వహించాలని గర్భిణులు, బాలింతలకు సూచించా రు. కేంద్రంలో ఈ సమావేశం అనంతరం కాలనీలో బ్యానర్లు ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అర్బన్-1 ప్రాజెక్టు సూపర్‌వైజర్, పలు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచరపాలెం: గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన అవసరమని అర్బన్ ఐసీడీఎస్ సీడీపీవో రమణికుమారి అన్నారు. 48వ వార్డు జైప్రకాశ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీపేట హెల్త్ సెంటర్ వైద్యాధికారి గౌతమితోపాటు సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



సత్యానగర్‌లో అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీలు, స్థానికులు



కంచరపాలెం జైప్రకాశ్‌నగర్‌లో మాట్లాడుతున్న వైద్యాధికారి

విశాఖలో అదృశ్యమై..ఏజెన్సీలో విగతజీవిగా మారి..

- అనుమానాస్పద స్థితిలో కంచరపాలేనికి చెందిన యువకుడి మృతి



మృతిచెందిన చంద్రకాంత్ (ఫైల్)

కంచరపాలెం/ డుంబ్రిగుడ, ఆగస్టు 5: వారం కిందట అదృశ్యమైన కంచరపాలెం పరిధి జై ప్రకాశ్‌నగర్‌కు చెందిన యువకుడు అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం జాముగుడలో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది కనిపించాడు. ఈ కేసుకు సంబంధించి వివరాలివి.. జై ప్రకాశ్‌నగర్‌కు చెందిన బంగారి కోటేశ్వరరావు, ఈశ్వరి దంపతుల కుమారుడు చంద్రకాంత్ జూలై 30వ తేదీ నుంచి కనిపించలేదు. ఈ నేపథ్యంలో తండ్రి కోటేశ్వరరావు ఇటీవల కంచరపాలెం, డుంబ్రిగుడ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ఈ క్రమంలో డుంబ్రిగుడ మండలం కోర్రాయి పంచాయతీ జాముగుడ పొలం గెడ్డ వాగులో ఓ యువకుడు మృతి చెందినట్టు సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో క్లూస్ టీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మృతదేహం తమ కుమారుడిదిగా తండ్రి కోటేశ్వరరావు గుర్తించారు. అయితే, చంద్రకాంత్ అరకు తన స్నేహితులతో కలిసి పిక్నిక్‌కు వెళ్లినట్టు సమాచారం. డుంబ్రిగుడ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రుద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

కుష్ఠుశరణాలయం వార్షికోత్సవం

డాబాగార్డెన్స్, ఆగస్టు 5: డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలోని కుష్ఠు శరణాలయం 70వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ దిలీప్‌కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రేమ సమాజం వారు మిగిలిన సేవలన్నింటికంటే కుష్ఠు రోగులకు ఆశ్రయం కల్పించి వారి సేవలందించడం గొప్ప విషయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ సమాజం అధ్యక్ష, కార్యదర్శులు బుద్ధ శివాజీ, హరిమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వారికి దుస్తులు పంపిణీ చేశారు.

కనకమహాలక్ష్మికి ఎమ్మెల్యే పూజలు



అమ్మవారికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పూర్ణామార్కెట్, ఆగస్టు 5: శ్రావణ మాస ఉత్సవాలు పురస్కరించుకుని దక్షిణ నియోజవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు. అర్చకులు ఆల యమర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. శ్రావణలక్ష్మిగా కొలువుతీరిన అమ్మవారికి పసుపు, కుంకుమలు మంగళహారతులిచ్చిపూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి. ఉమామహేశ్వరరావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

... 5వ పేజీ తరువాయి

గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నామినేషన్లు దాఖల సమయంలో అభ్యర్థిని పది మంది బలపర్చాల్సి ఉంటుందని, ఎన్నికల ఖర్చుపై ఎటువంటి పరిమితులు లేవన్నారు. ఎన్నికల కోడ్ అమలుకు తహసీల్దారు నేతృత్వంలో మండల స్థాయిలో కమిటీలు వేశామన్నారు. రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు వేశామని ఆయన వివరించారు.

ఎక్స్‌అఫీషియో సభ్యులుగా పేర్ల నమోదుకు వైసీపీ నేతల దరఖాస్తు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా తమ పేర్లు నమోదు చేయాలని వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, నిరంజనరెడ్డి కోరారు. ఈ మేరకు ముగ్గురూ దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ముగ్గురు ఎంపీలు జీవీఎంసీలో ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉన్నారు. దరఖాస్తులు పరిశీలించిన తరువాత అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు.

కేజీహెచ్‌లో హైడ్రామా

... 5వ పేజీ తరువాయి

మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ ఆస్పత్రి పరిపాలనా విభాగానికి వచ్చారు. సూపరింటెండెంట్ కార్యాలయంలోకి వెళ్లి తాను బాధ్యతలు తీసుకుంటానంటూ ప్రస్తుత సూప రింటెండెంట్ శివానందకు తెలిపారు. ఇరువురు సుమారు అర్ధగంటపాటు లోపల చర్చించుకున్నారు. అయితే, డీఎంఈ కార్యాలయం నుంచి తనకు ఎటువంటి ఆదేశాలు రాలే దంటూ శివానంద్ వెల్లడించారు. రీ పోస్టింగ్ ఆర్డర్స్ ఉంటే చూపించాలని కోరారు. రీ పోస్టింగ్ ఆర్డర్స్ తనకు రాలేదని, అయితే ఉన్నతాధికారులుమాత్రం బాధ్యతలు తీసుకోవాలని చెప్పినట్టు అశోక్ కుమార్ వెల్లడించారు. మౌఖిక ఆదేశాల ప్రకారం తాను బాధ్యతల నుంచి తప్పుకుంటే ఇబ్బందులు తలెత్తుతాయని శివానంద్ చెప్పగా, లిఖిత పూర్వక ఆర్డర్స్ వచ్చిన తరువాతే చేరతానంటూ అశోక్‌కుమార్ వెళ్లిపోయారు. సెలవులు ముగిం చుకుని వచ్చిన విషయం డీఎంఈకి ఆయన రిపోర్టు చేసినట్టు తెలిసింది. ఈ వ్యవ హారం ఆస్పత్రిలో చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే సూపరింటెండెంట్ పోస్టుపై డీఎంఈ స్థాయిలో నిర్ణయం జరిగిందని చెబు తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టమైన ఆదేశాలువచ్చే అవకాశం ఉందంటున్నారు. ఉన్నతాధికా రుల నుంచి ముందస్తు సమాచారం ఉండడం వల్లే డాక్టర్ అశోక్‌కుమార్‌కు వచ్చారా?, లేక ఇంకేదైనా కారణం ఉందా?..అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉందని చెబుతున్నారు.

లేఅవుట్లు ఖాళీ

... 5వ పేజీ తరువాయి

వేశారు. దరఖాస్తులు ఆహ్వానించారు. ప్లాట్లను 150 గజాలు, 200 గజాలు, 240 గజాలుగా విభజించారు. ప్రభుత్వ ఉద్యోగులు దరఖాస్తు చేసుకుంటే 20శాతం రాయితీతో ఇస్తామని ప్రకటించారు. విస్తృత ప్రచారం చేశారు. అయితే ఈ నాలుగు లేఅవుట్లలో కేవలం పాలవలస లేఅవుట్‌పైనే పలువురు ఆసక్తి చూపారు. ఇది అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిలో టోల్‌గేట్‌కు సమీపాన ఉండడంతో ఎక్కువ మంది మక్కువ చూపారు.

- పాలవలసలో 77.32 ఎకరాల విస్తీర్ణంలో 472 ప్లాట్లు వేశారు. చదరపు గజం ధర రూ.14,500 ఖరారు చేశారు. దరఖాస్తులు ఆహ్వానించారు. గడువు పెట్టారు. పెద్దగా ఆదరణ లేకపోవడంతో గడువు నిబంధన తొలగించారు. ఆసక్తి ఉన్నవారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రకటించారు. మొత్తంగా ఆ లేఅవుట్‌లో 164 ప్లాట్లను లాటరీ విధానంలో దరఖాస్తుదారులకు కేటాయించారు. ఇంకా 308 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి.

- రామవరం గ్రామంలో 119.33 ఎకరాల్లో 763 ప్లాట్లు వేశారు. చ.గజం ధర రూ.14 వేలు నిర్ణయించారు. అనేక సార్లు దరఖాస్తులు ఆహ్వానించినా పెద్దగా స్పందన లేదు. ఇప్పటివరకు కేవలం తొమ్మిది దరఖాస్తులే వచ్చాయి.

- గంగసాని అగ్రహారం-1లో 85.54 ఎకరాల్లో 618 ప్లాట్లు వేశారు. అక్కడ కూడా చ.గజం ధర రూ.14 వేలు నిర్ణయించారు. ఈ లేఅవుట్‌లో ప్లాట్లకు 16 మంది మాత్రమే దరఖాస్తు చేశారు.

- గంగసాని అగ్రహారం-2లో 42.2 ఎకరాల్లో 257 ప్లాట్లు వేశారు. అక్కడ చ.గజం రూ.14 వేలు ధర పెట్టారు. దీనికి మరీ ఘోరంగా నాలుగంటే నాలుగే దరఖాస్తులు వచ్చాయి.

పాలవలస తప్ప మిగిలిన మూడు లేఅవుట్లకు పెద్దగా ఆదరణ లేకపోవడంతో వాటిని అభివృద్ధి చేయకుండా అలాగే ఉంచేశారు. ఆ మూడింటికి వచ్చిన 29 మంది దరఖాస్తుదారులకు పాలవలసలో ప్లాట్లు కేటాయించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఆడ్ బిట్ల వేలంపై దృష్టిపెట్టిన అధికారులు ఆ తరువాత పాలవలసలో మిగిలిన ప్లాట్ల విక్రయానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నారు. అయితే ఈసారి దరఖాస్తులు ఆహ్వానించినప్పుడు రేట్లు పెంచకుండా పాత రేట్లకే ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులు కోరుతున్నారు. అలాగైతే తామంతా సంఘంగా ఏర్పడి తీసుకుంటామని అంటున్నారు.

హోరాహోరీగా స్థాయీ సంఘం పోరు

... 5వ పేజీ తరువాయి

ప్రాంతానికి తరలించి, బుధవారం ఉదయం అక్కడ నుంచి ఓటేసేందుకు నేరుగా జీవీఎంసీ కార్యాలయానికి తీసుకురావాలనే వ్యూహంలో వైసీపీ నేతలు ఉన్నట్టు తెలిసింది. మరోవైపు కూటమి ఎమ్మెల్యేలు, నేతలు స్టాండింగ్ కమిటీలో పదికి పది స్థానాలు గెలుపొందడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే వైసీపీ నుంచి టీడీపీలో చేరాలనే ఆసక్తితో ఉన్నవారిలో ఎవరిని తీసుకోవాలనే దానిపై సోమవారం జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావుతో చర్చించినట్టు తెలిసింది. కూటమికి చెందిన కార్పొరేటర్లను కూడా క్యాంపునకు తరలించే ప్రతిపాదన ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఏదిఏమైనా కూటమి, వైసీపీకి సమానబలం ఉండడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

ఏయూలో హాస్టల్ విద్యార్థుల ఆందోళన

... 5వ పేజీ తరువాయి

అనుమతించకపోవడంతో అక్కడే నిల్చుని నిరసన తెలిపారు. విద్యార్థుల ఆందోళనతో బయటకు వచ్చిన ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు వారితో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. వెంటనే హాస్టల్ వార్డెన్ ప్రొఫెసర్ హరనాథ్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఇకపై ఏదైనా సమస్య ఉంటే ముందు వార్డెన్ దృష్టికి తీసుకువెళ్లాలని, ఆ తరువాత తన దృష్టికి తీసురావాలన్నారు. ఇకపై భోజనం రుచిగా ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు. వీసీ సూచనలు మేరకు వార్డెన్ హరనాథ్ 15 మంది విద్యార్థులతో మెస్ కమిటీని ఏర్పాటుచేశారు. ఇకపై ఆ కమిటీ ఆధ్వర్యంలో మెస్ నిర్వహించబడుతుందన్నారు. సమస్య ఉంటే విద్యార్థులు మెస్ కమిటీతో చర్చించి అనంతరం వార్డెన్ దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు.

డీఎస్సీ, టెట్‌పై 7న ఉచిత అవగాహన సదస్సు

డాబాగార్డెన్స్, ఆగస్టు 5: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఎస్సీ, టెట్‌పై ఈ నెల 7న నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు కో ఆర్డినేటర్ సతీష్ తెలిపారు. కోచింగ్ నిపుణులు కె.ఎస్. లక్ష్మణరావు, మరికొందరు నిష్ణాతులు పాల్గొని బోధిస్తారన్నారు. ఈ సదస్సులో మనోవిజ్ఞాన శాస్త్రం మెటీరియల్ ఉచితంగా అందిస్తామన్నారు. ఇతర వివరాలకు ఫోన్ 93472 05549ను సంప్రదించాలని కోరారు.



యంత్ర సాయంతో వరినారు ఊడుపుతున్న దృశ్యం

యంత్రం సాయంతో వరినాట్లు

పెందుర్తి, ఆగస్టు 5: మండల వ్యవసాయ అధికారులు ఆధ్వర్యంలో సోమవారం నరవ గ్రామంలో యంత్రం సాయంతో వరినాట్లు వేశారు. 20 ఎకరాల్లో ఊడుపులు పూర్తి చేశారు. ఈ యంత్రం నిర్వహణకు రోజుకు రూ.నాలుగు వేలు అవుతుందని జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి ఈ సందర్భంగా తెలిపారు. ఈ యంత్రం వల్ల ఖరీఫ్ సాగులో సమయం, డబ్బు ఆదా అవుతుందని పేర్కొన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ మాణిక్యమాంబ, మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు

గాజువాక, ఆగస్టు 5: నిరుద్యోగులకు వృత్తి విద్యలో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించడంలో టెక్నికల్ ట్రైనింగ్ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏపీ టెక్నికల్ కేంద్రాల ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పల్లాను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ప్రతినిధులు నివేదించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఆటోనగర్‌లో సొంత భవనం ఏర్పాటునకు కృషి చేస్తానన్నారు. యువతకు వెల్డింగ్ శిక్షణ ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని వారికి పల్లా సూచించారు. కార్యక్రమంలో ప్రతినిధులు కరణం కనకారావు, పాపారావు, వెంకటరమణ, ప్రసాద్, నందారాపు రమణ, అచ్చిబాబు పాల్గొన్నారు.

క్లాత్ సంచులు పంపిణీ

మల్కాపురం, ఆగస్టు 5: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల మలేరియా విభాగం అధికారి, 61వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో కోరమాండల్ కంపెనీ యాజమాన్యం సమకూర్చిన గుడ్డ సంచులను జీవీఎంసీ కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని అన్నారు. ప్రతి శుక్రవారం తప్పనసరిగా డ్రైడే-ఫ్రైడే పాటించాలని అన్నారు. ప్రజలకు కార్మికులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని కోరారు.

లింగ సమానత్వంపై సదస్సు

పెందుర్తి, ఆగస్టు 5: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో సోమవారం లింగ సమానత్వంపై సదస్సు నిర్వహించారు. కరస్పాండెంట్ టి.థియోఫిలస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఫ్లోరా అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఏయూ హ్యూమన్ రైట్స్ సంఘ సభ్యురాలు హాజరై మాట్లాడారు. లింగ సమానత్వంతోనే సమసమాజ స్థాపన సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ లింగ వివక్షను విడనాడాలని పిలుపునిచ్చారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చురుగ్గా జనసేన సభ్యత్వ నమోదు

అగనంపూడి, ఆగస్టు 5: జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి కూడలిలో జనసేన పార్టీ నాలుగో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సభ్యత్వాలు పొందేందుకు చివరి రోజు కావడంతో అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ వార్డు అధ్యక్షుడు మేడిశెట్టి విజయ్ మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం అందించే బీమా సదుపాయాన్ని జనసైనికులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకులు గవర చిన్నారావు, తలారి సన్యాసిరావు, ఎస్.ప్రసాద్, కిరణ్, ప్రభాస్ రాజు, బి.హరీశ్, అప్పలరాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ నుంచి వాహనాల తరలింపు

కూర్మన్నపాలెం, ఆగస్టు 5: పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు దువ్వాడ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వివిధ ఘటనల్లో పట్టుబడిన వాహనాలను పీఎం పాలెం డంపింగ్ యార్డుకు సోమవారం మూడు లారీల్లో తరలించారు. ఈ సందర్భంగా సీఐ ఎర్రంనాయుడు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సీపీ ఆదేశించారన్నారు. ట్రాఫిక్, క్రైమ్, లా అండ్ ఆర్డర్ కేసులకు సంబంధించిన పలు వాహనాలను తరలించారు.

సినిమా గైడ్

- **బడ్డీ :** జగదాంబ, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** మెలోడీ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **ఉషా పరిణయం :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **రాయన్ :** జగదాంబ, గోకుల్, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), రాములమ్మ (తగరపువలస)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 28, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 58, బెండకాయలు 20, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 44, బీరకాయలు 42, ఆనపకాయ 17, కాలీఫ్లవర్ 38, క్యాబేజీ 30, క్యారెట్ 32, దొండకాయలు 30, బంగాళదుంపలు 34, అరటికాయ (పెద్దవి) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 54, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 40, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 80, పొటల్స్ 28, కీరదోస 30, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	77
ఫారం ధర	--	97
విత్ స్కిన్	--	164
స్కిన్‌లెస్	--	174

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..





ములగాడ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించడంతో బారులుతీరి నిలిచిపోయిన వాహనాలు

ములగాడ రోడ్డులో ట్రాఫికర్!

డాక్‌యార్డు వంతెన మూసివేతతో ఈ మార్గంలో పెరిగిన వాహనాల రాకపోకలు

ఒక్కోసారి ట్రాఫిక్ స్తంభనతో గంటలకొద్దీ బారులుతీరి నిలిచిపోతున్న వాహనాలు

శబ్ద కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న గ్రామస్థులు

మల్కాపురం, ఆగస్టు 5:

డాక్‌యార్డు సర్దార్ వల్లాబాయ్ పటేల్ (ఎస్‌వీపీ) వంతెన మూసివేతతో ములగాడ గ్రామ రహదారిలో ట్రాఫిక్ బాగా పెరిగిపోయింది. ఈ మార్గం ప్రస్తుతం ప్రధాన రహదారిని తలపిస్తోంది. రోడ్డు చాలా చిన్నది కావడంతో వాహనాలు ముందుకు కదలడానికి ఒక్కోసారి గంటలకొద్దీ సమయం పడుతోందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతుండడంతో గమ్య స్థానాలకు చేరుకోవడంలో ఆలస్యం చోటుచేసుకుంటుందని వాపోతున్నారు. ఈ మార్గంలో వాహనాల రద్దీ పెరగడంతో తమకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ములగాడ గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రతిరోజూ ములగాడ మీదుగా వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తుండడంతో శబ్ద కాలుష్యంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. డాక్‌యార్డు వంతెన మూసివేయడంతో ఇప్పుడు మల్కాపురం, శ్రీహరిపురం, గాజువాక, పెదగంట్యాడ, కూర్మన్నపాలెంతో పాటు ఇతర ప్రాంతాలకు ప్రాంతాలకు చెందిన వాహనదారులూ ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా ఈ రోడ్డును షీలానగర్ టోల్‌గేటుకు వద్దకు అనుసంధానం చేయడంతో వాహనదారులందరూ ఈ రహదారిగుండా రాకపోకలు సాగిస్తున్నారు. ములగాడ మీదుగా షీలానగర్ టోల్ గేటుకు చేరుకుని.. అక్కడ నుంచి ఎన్ఏడీకి గానీ, పాత గాజువాకకు, ఇటు కాన్వెంట్ జంక్షన్‌కు, లేదా నగరంలోని ఇతర ప్రాంతాలకు వాహనదారులు వెళ్లి వస్తున్నారు. దీంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ బాగా పెరిగిపోయింది. ఉదయం ఆరు నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ఈ మార్గం గుండా అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని ములగాడ వాసులు చెబుతున్నారు. ట్రాఫిక్ రద్దీ మూలంగా ఇప్పటికే ఈ రోడ్డులో రెండు మూడు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, వాహనదారుల మధ్య వాగ్వాదాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. కాగా ఈ రోడ్డులో ఎక్కడా స్పీడ్ బ్రేకర్లు కూడా లేకపోవడంతో చాలామంది అతి వేగంతో వాహనాలు నడుపుతున్నందున ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బయటకు వచ్చేందుకు భీతిల్లుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అందువల్ల అధికారులు స్పందించి ఈ మార్గంలో ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ

ఆటోనగర్, ఆగస్టు 5: జీవీఎంసీ 87వ వార్డు పరిధి రాజులపాలెం శ్రీవారి ఆలయంలో, 88వ వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్ గ్రీన్ సిటీలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావులు మాట్లాడుతూ ఈ నెల ఏడున ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా మహాలక్ష్మికి పంచామృతాభిషేకాలు, తొమ్మిదిన శ్రావణం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి క్షీరాభిషేకాలు, సామూహిక కుంకుమార్చన జరుపుతామన్నారు. అలాగే 16న శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు, సహస్ర గాజుల అలంకరణ, 18న శ్రీలక్ష్మీశ్రీనివాసుల కల్యాణం, 19న శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పుష్పార్చన నిర్వహిస్తామన్నారు. 23న అమ్మవారికి వివిధ పండ్లతో అలంకరించి కుంకుమ పూజలు, 27న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక అర్చనలు, ఉట్టి కొట్టే కార్యక్రమం, 30న చామంతులతో మహిళలచే అమ్మవారికి అర్చనలు, కుంకమ పూజలను వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

వేపగుంట: జీవీఎంసీ 94వ వార్డు పరిధి నాయుడుతోట కృష్ణానగర్ గుడి వీధిలో ఉన్న దుర్గామల్లేశ్వరాలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. నెల రోజుల పాటు చండీహోమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అలాగే రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి శ్రావణమాస పూజలను సెప్టెంబరు మూడో తేదీ వరకు నిర్వహిస్తామని అర్చకులు పేర్కొన్నారు. ఈ నెలలోని నాలుగు శుక్రవారాలూ శ్రీలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు జరుపుతామన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు పరిధి విమాన్‌నగర్ సమీపం కనకమహాలక్ష్మీనగర్‌లో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాస పూజలు ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు జరుపుతామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



గ్రీన్ సిటీలో పూజలందుకున్న మహాలక్ష్మి అమ్మవారు

ప్రజల సంపదను కొల్లగొట్టే హక్కు కేంద్రానికి లేదు

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

కూర్మన్నపాలెం, ఆగస్టు 5: ప్రజల సంపదను కొల్లగొట్టే హక్కు కేంద్ర ప్రభుత్వానికి లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,271వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏకపక్ష వైఖరితో స్టీల్‌ప్లాంటును వంద శాతం విక్రయించాలని కుట్రలు చేస్తుండడం దారుణమన్నారు. ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయిస్తే పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేస్తున్న కార్మికుల పట్ల చిన్నచూపు చూడడం శోచనీయమన్నారు. కార్మికుల పోరాటాలతోనే విజయాలు వరిస్తాయన్నారు. ఇప్పటికైనా కేంద్రం మొండి వైఖరిని విడనాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు విల్లా రామ్మోహన్‌కుమార్, కె.రాజాబాబు, జయ, జి.ఆనంద్, తాండ్ర కనకరాజు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

కార్మికులపై చిన్నచూపు తగదు: ఇంటక్ నేత మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ కార్మికులపై యాజమాన్యం చిన్నచూపు తగదని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రగతికి విశేష కృషి చేస్తున్న కార్మికులపై మాత్రం యాజమాన్యం నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తుందన్నారు. సకాలంలో జీతాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సంస్థలో పూర్తి స్థాయి ఉత్పత్తి జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్‌ను కాపాడేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలని కోరారు. ప్లాంట్‌లో ఉద్యోగుల సంఖ్య తగ్గుతున్నందున నియామకాలు చేపట్టాలని, ముఖ్యంగా ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలన్నారు. నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, నాయుడు, బీఎస్ రాజు, కొమ్ము ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మూలకు చేరిన కోల్ట్ స్టోరేజీ ప్లాంట్

గోపాలపట్నం

రైతు బజారులో రైతులు ఇబ్బంది

ఏడాదిగా మరమ్మతులు శూన్యం

గోపాలపట్నం, ఆగస్టు 5: గోపాలపట్నం రైతుబజారులో నిర్మించిన కోల్ట్ స్టోరేజీ ప్లాంట్ మూలకు చేరి ఏడాది గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో పెద్ద రైతు బజార్లలో ఇదొకటి. ఈ బజారులో ప్రతిరోజూ సుమారు 220 మంది రైతులు వ్యాపారాలు సాగిస్తుంటారు. వీరిలో 80శాతం మంది కూరగాయలు విక్రయించేది రైతులే. వీరు నిత్యం తాము తీసుకువచ్చిన కూరగాయలు విక్రయించగా, మిగిలిన వాటిని రైతు బజారు స్టాళ్లలోనే నిల్వ చేయాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో మరుసటి రోజుకి చాలా కూరగాయలు పాడై రైతులు నష్టపోయేవారు. ఈ క్రమంలో 2017లో రైతు బజారులో కోల్డ్ స్టోరేజీ ప్లాంట్‌ను నిర్మించారు. అనివార్య కారణాలతో ఏడాది పాటు ప్రారంభానికి నోచుకోలేదు. కాగా 2018లో అందుబాటులోకి తీసుకువచ్చారు. అప్పటినుంచి ఈ కోల్ట్ స్టోరేజీ ప్లాంట్‌ను రైతులు సద్వినియోగం చేసుకునేవారు. సుమారు ఆరు టన్నుల కూరగాయలు నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగిన ఈ కోల్డ్ స్టోరేజీ ప్లాంట్‌లో ఎంతో ఉపయోగకరంగా ఉండేది. రైతులు ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా నిల్వ చేసుకునేవారు. అయితే ఇది మరమ్మతులకు గురై ఏడాది గడుస్తున్నా, మరమ్మతులు చేపట్టక పోవడంతో రైతులకు మళ్లీ ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయానికి అతి సమీపంలో ఉన్న ఈ బజారును నిరంతరం అధికారుల పర్యవేక్షిస్తుంటారు. అలాంటి చోట కోల్డ్‌స్టోరేజీ ప్లాంట్ మూతపడి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన కోల్డ్ స్టోరేజీ ప్లాంట్



గ్రామాభ్యుదయ సంఘం కళావేదికను ప్రారంభిస్తున్న గణబాబు

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి: ఎమ్మెల్యే గణబాబు

సింధియా, ఆగస్టు 5: సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో బాపూజీ గ్రామాభ్యుదయ సంఘం కళావేదికను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా చిన్న, నాయకులు జెర్రిపోతుల నరసింగరావు, పుక్కల కృష్ణ, తోట రత్నం, బొండ కృష్ణ, శ్యామ్ గ్రామపెద్దలు జగ్గునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

గాజువాక, ఆగస్టు 5: ప్రభుత్వ స్టీల్ సిటీ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 29న ఐటీఐకు అన్ని ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఐటీఐను సంప్రతించాలని కోరారు.

సామాజిక భవనానికి స్థలం కేటాయించాలని 'పల్లాకు' వినతి

పెదగంట్యాడ, ఆగస్టు 5: పారిశ్రామిక ప్రాంతంలో గీత సహకులాల సౌకర్యార్థం సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం పారిశ్రామిక ప్రాంత గీత సహకులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు చెల్లుబోయిన నాయుడు, నెల్లి సాధూరావు, తదితరులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును సోమవారం పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పారిశ్రామిక ప్రాంతంలో అధిక సంఖ్యలో గీత సహకులాల వారు ఉన్నారని, పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు భవనం లేనందున సామాజిక భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ అంశాన్ని పరిశీలనలోకి తీసుకుంటామని పల్లా హామీ ఇచ్చినట్టు సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు అండిబోయిన పెదనూకరాజు, ఎస్.నాగరాజు, ఎన్.గురుమూర్తి, పి.అన్నవరం, పి.భాస్కరరావు, బి.కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.



పెదగంట్యాడలో పోస్టర్లు ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు

తల్లి పాలే బిడ్డకు పౌష్టికాహారం

పలుచోట్ల అవగాహన కార్యక్రమాల నిర్వహణ

పెదగంట్యాడ, ఆగస్టు 5: తల్లి పాలే బిడ్డకు సంపూర్ణ పౌష్టికాహారమని, అవిరోగ నిరోధక శక్తిని పెంచుతాయని అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాలు బిడ్డలు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ పోస్టర్లను ప్రదర్శించారు. గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా వియ్యపువానిపాలెం, గొంతెనవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తల్లి పాల వల్ల చూకూరే మేలును వివరిస్తూ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

వేపగుంట: జీవీఎంసీ 94వ వార్డు పరిధి అప్పలనర్సయ్యకాలనీ దరి గంగిరెడ్డి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సూపర్‌వైజర్ ఎం. లక్ష్మీదేవి మాట్లాడుతూ కనీసం ఆరునెలల వరకు శిశువులకు తల్లిపాలు తప్పనిసరిగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కనకమహాలక్ష్మి, జె. జగదాంబ, పోలమ్మ, సత్యవతి, ఏఎన్ఎం మంగలక్ష్మి, ఆశ వర్కర్ భారతి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ పాస్ ఉంటేనే 'ఉక్కు'లోకి ఎంట్రీ

స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంతో పటిష్ఠ భద్రత

స్టీల్‌ప్లాంట్ గేటు వద్ద విస్తృతంగా సీఐఎస్ఎఫ్ సిబ్బంది తనిఖీలు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 5: ఉక్కు కర్మాగారంలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరూ ఒరిజినల్ పాస్ కలిగి ఉండాలని, జిరాక్స్ పాస్‌లతో వస్తే లోపలకు అనుమతించబోమని సీఐఎస్ఎఫ్ అధికారులు పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలో స్టీల్‌ప్లాంటులో భద్రతను మరింత పెంచారు. ప్లాంట్‌లోకి ప్రవేశించే వారికి కఠిన ఆంక్షలు విధిస్తున్నారు. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు తమ పాస్‌ల కలర్ జిరాక్స్‌లను ఎవరికీ ఇవ్వరాదని అధికారులు సూచిస్తున్నారు. ప్లాంట్ ప్రధాన గేటు, విస్తరణ, బీసీ గేట్ల వద్ద అదనపు సిబ్బందిని నియమించారు. ప్లాంట్‌లోకి వెళ్లే అందరినీ, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాక లోపలకు అనుతిస్తున్నారు. అలాగే కర్మాగారంలోని ప్రతి విభాగం వద్ద అదనపు సిబ్బందిని నియమించారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సీఐఎస్ఎఫ్ అధికారులకు, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఉద్యోగులకు అధికారులు సూచించారు.

డీఆర్‌సీ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం



కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌సీ ట్రస్ట్ ప్రతినిధులు, వైద్యులు

పెందుర్తి, ఆగస్టు 5: దాడి రమణ చిట్టి (డీఆర్‌సీ) చారిటబుల్ ట్రస్ట్ నేతృత్వంలో సంస్థ నిర్వాహకుడు దాడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గౌరీ సంఘ భవన్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో ప్రీ స్క్రీనింగ్ క్యాంప్, నేత్ర, ఇతర వ్యాధులకు సంబంధించి నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 258 మంది రోగులు వైద్య సేవలను వినియోగించుకోగా, వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారికి త్వరలో ఆస్పత్రులకు తరలిస్తామని ఉమామహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ట్రస్ట్ చైర్మన్ దాడి రమణచిట్టి, సభ్యులు పాల్గొన్నారు.

కల్లు తాగిన మత్తులో పూర్వ విద్యార్థి వీరంగం

పెందుర్తి, ఆగస్టు 5: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద సోమవారం ఓ పూర్వ విద్యార్థి కల్లు తాగిన మత్తులో వీరంగం చేశాడు. పెద్దగా అరుస్తూ హల్‌చల్ చేయడంతో విద్యార్థులు ఆందోళనకు లోనయ్యారు. తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు వచ్చి ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కళాశాల విడిచిపెట్టే సమయంలో ప్రధాన గేటు వద్ద కాపుగాసిన ఆ పూర్వ విద్యార్థి తరగతి గదుల నుంచి బయటికి వస్తున్న విద్యార్థులతో గొడవకు, కొంతమందితో కొట్లాటకు దిగడంతో స్థానికులు వారించారు. దీంతో వారిపైనా దుర్భాషలాడుతూ రెచ్చిపోయాడు. ఎస్ఐ అసిరి తాత ఆ విద్యార్థిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

షిప్‌యార్డు సమస్యలను పరిష్కరించాలని వినతి

మల్కాపురం, ఆగస్టు 5: షిప్‌యార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించవలసిందిగా కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు టీఎన్‌టీయూసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎయిర్‌పోర్టులో ఆయనను కలిసి పలు సమస్యలను వివరించారు. ఆయా సమస్యలపై సీఎం చంద్రబాబునాయుడు, సంబంధిత మంత్రితో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని రామ్మోహన్‌నాయుడు తెలిపినట్టు నాయకులు పేర్కొన్నారు. త్వరలో ఆయన షిప్‌యార్డును సందర్శించి నేరుగా సమస్యలు తెలుసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు మాడిస రమణమూర్తి, బండారు జ్ఞానేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

పెదగంట్యాడ, ఆగస్టు 5: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల రిటైర్డు ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని కోరుతూ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ పెదగంట్యాడ శాఖ తీర్మానించింది. ఇక్కడి సీడబ్ల్యూసీలో సోమవారం అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిల్లి దీనబంధు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పించన్‌ను పెంచాలని కోరారు. రిటైర్డు ఉద్యోగుల డిమాండ్ల సాధనకు ఈ నెల ఎనిమిదిన జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు కణితి అప్పలరాజు, పెంటారావు, అప్పారావు, గురప్ప, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఉక్కు క్రీడాకారిణి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 5: ఏషియన్ బాక్సింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు స్టీల్ ప్లాంట్‌కు చెందిన క్రీడాకారిణి కనక దీపిక ఎంపికైంది. ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 10 వరకు అబుదాబిలోని ఏ1 ఏఈఎన్ సిటీలో ఏషియన్ జూనియర్ బాలబాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల ఎనిమిది నుంచి 11వ తేదీ వరకు రోహతక్‌లో శాయ్ ఆధ్వర్యంలో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించనున్నారు. జాతీయ డీపీ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలతో పాటు పలు మెడల్స్ సాధించిన దీపికను రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా బాక్సింగ్ కోచ్ కె.శ్రీనివాసరావు ఆమెను అభినందించి జ్ఞాపికను అందజేశారు.

విశ్రాంతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించరూ..

అగనంపూడి, ఆగస్టు 5: స్టీల్‌ప్లాంట్, హిందూస్థాన్ షిప్‌యార్డు, బీహెచ్‌పీవీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పలు సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసిన తాము రెండేళ్ల క్రిందట సంఘంగా ఏర్పాటయ్యామని, సంఘంలో 250 మంది సభ్యులున్నట్టు వివరించారు. తమ సమస్యలపై చర్చించుకునేందుకు గాను కమ్యూనిటీ భవనం కేటాయించాలని కోరారు. అందుకు కార్పొరేటర్ సానుకూలంగా స్పందించారని సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బోసుబాబు, భాస్కరరాజు, కాళిదాసు, వై.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పర్సనల్ బ్రాంచిలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

విశాఖపట్నం, ఆగస్టు 5: వాల్తేరు రైల్వే పర్సనల్ బ్రాంచి రిక్రియేషన్ క్లబ్ (పీబీఆర్‌సీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా క్లబ్ ప్రతినిధులు సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ కార్యాలయంలో జరిగిన ఈ శిబిరంలో 50 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్, పీబీఆర్‌సీ కన్వీనర్ రంజన్ మొహంతి మాట్లాడుతూ, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంకు సమన్వయంతో నిర్వహించిన ఈ శిబిరంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రక్తదాతలను అభినందించారు. క్లబ్ ప్రతినిధులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ ఏ వెంకటేశ్వరరావు, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, పీబీఆర్‌సీ కార్యదర్శి ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలతోనే రోడ్డు ప్రమాదాలకు చెక్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ముంబై సంస్థ ప్రతినిధి

కంచరపాలెం, ఆగస్టు 5 : ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా ఉండగలమని యునైటెడ్ వే ముంబాయి సంస్థ ప్రతినిధులు సూచించారు. రహదారి భద్రతపై ఆర్పీపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలను వివరించారు. వివిధ స్లైడ్స్ ప్రదర్శించారు. తొందరపాటుతో రోడ్డు దాటకూడదని, జీబ్రా క్రాసింగ్‌లో మాత్రమే నడవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నియమాలు, సిగ్నల్స్‌పై అవగాహన కలిగించారు. స్కూల్ హెచ్‌ఎం ఆర్. శ్రీనివాసరావు, జీవీ జగన్నాధరావు,పి.వెంకటేశ్వరరావు. కె.సత్యనారాయణతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బ్రహ్మకుమారీస్ సేవలు అభినందనీయం'

డాబాగార్డెన్స్, ఆగస్టు 5: బ్రహ్మకుమారీ సంస్థ అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు అభినందనీయమని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో సెప్టెంబర్ 26 నుంచి రాజస్థాన్‌లో బ్రహ్మకుమారీస్ నిర్వహించనున్న మీడియా సదస్సుకు సంబంధించిన వివరాలను సంస్థ ప్రతినిధి రామేశ్వరి తెలిపారు. ఈ సదస్సులో ఆరోగ్యం, ఆధ్యాత్మికత, ధ్యానం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని నగరంలోని పాత్రికేయులు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో బ్రహ్మకుమారీస్ సభ్యులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు పత్రాలందిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 5 : గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారు ఎదుట వార్డు జనసేన అధ్యక్షుడు తుమ్మల త్రినాద్ ఆధ్వర్యంలో పార్టీ నాల్గో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సుమారు 500 మందికి పైగా సభ్యత్వం తీసుకున్నట్టు ఆయన చెప్పారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉత్తరం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ త్రినాధ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీలా హరిప్రసాద్, బండి రాజు, కనకరాజు, రత్నం, మేరా నాయుడు, శేఖర్ పాల్గొన్నారు.

జీవీఎంసీ స్థలం ఆక్రమణ

- టర్నర్ చౌల్ట్రీ వద్ద కబ్జా
- దశాబ్దాల కిందట జనాల అవసరాలకు మునిసిపాలిటీ కొనుగోలు?
- ప్రస్తుతం ఓ వ్యాపారి చెరలో..
- మిన్నకుంటున్న యంత్రాంగం



టర్నర్‌చౌల్ట్రీ మెయిన్ రోడ్డు అనుకుని జీవీఎంసీ స్థలంలో వస్త్ర దుకాణం



రాత్రివేళలో పరదాలు కప్పిన దృశ్యం

జగదాంబ కూడలి, ఆగస్టు 3: టర్నర్ చౌల్ట్రీ మెయిన్ రోడ్డు ఫుట్‌పాత్‌ను అనుకుని ఉన్న జీవీఎంసీ స్థలం ఆక్రమణకు గురైంది. స్థానిక నివాసితుల రస్తాగా గల ఈ స్థలం ఫుట్‌పాత్ వ్యాపారి చెరలో ఉంది. ప్రజావసరాల కోసం విశాఖ మునిసిపాలిటీగా ఉన్న సమయంలో ఈ స్థలాన్ని అప్పటి అధికారులు కొనుగోలు చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. కొనేళ్లుగా ఫుట్‌పాత్ వ్యాపారి ఈ స్థలాన్ని తనస్వాధీనంలోకి తెచ్చుకున్నట్టు స్థానిక సాలిపేట, తాడి ప్రాంతాలకు చెందిన సీనియర్ సిటిజన్స్, రోడ్డు పక్కన షాపు యజమానులు ఆరోపిస్తున్నారు. నాలుగు దశాబ్దాల కిందటి వరకు ఈ స్థలంలో రాకపోకలు సాగేవని, రాత్రివేళలో అప్పట్లో జనసంచారం తక్కువగా ఉండడం, అసాంఘిక కార్యకలాపాలకు ఈ స్థలం ఆసరాగా మారింది. ఈ స్థితిలో స్థానికులు కొందరు ఓ పూల మొక్కలు అమ్మకందారునికి జనానికి ఇబ్బందిలేకుండా ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఫుట్‌పాత్ విక్రయాలు పెరుగుతున్న క్రమంలో టర్నర్ చౌల్ట్రీ ఎదుట వ్యాపారం చేస్తున్న ఓ వస్త్ర వ్యాపారికి కొంత మేర ఈ స్థలంలో అవకాశం కల్పించారు. తదనంతరం మొక్కలు వ్యాపారి మృతి చెందడంతో ఈ స్థలం పూర్తిగా సొంతం చేసుకునేందుకు ఆ వస్త్ర వ్యాపారి కన్నేశారు. రహదారి కోసం జీవీఎంసీ ఏర్పాటు చేసిన స్థలంలో ఫుట్‌పాత్ వ్యాపారి చుట్టూ పరదాలు కట్టి అక్కడ స్థలం ఉందన్న ఆనవాలు లేకుండా చేస్తున్నారు. క్రమేపీ ఆక్రమణదారుడు దీనిని తమ సొంత స్థలంగా చలామణీలోకి తీసుకువచ్చారు. మొక్కల వ్యాపారిదిగా ఈ స్థలాన్ని పేర్కొంటూ తాను అద్దెకు ఇస్తున్నట్టు ప్రచారం సాగిస్తుండడంతో స్థానికులు మండిపడుతున్నారు. రూ. లక్షల్లో విలువ చేసే జీవీఎంసీ స్థలం ఆక్రమణకు లోనైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడడంలేదు. స్థలం ఆక్రమణదారుమెల్లమెల్లగా ఈ స్థలంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు రంగం సిద్ధమవుతున్నట్టు వ్యాపార వర్గాలు ఆరోపిస్తున్నాయి. వన్‌టౌన్ రోడ్డు విస్తరణ సమయం లోనూ టౌన్‌ప్లానింగ్ అధికారులుఈ కబ్జాను గుర్తించలేదు. జీవీఎంసీ స్థలంలో ఫుట్‌పాత్ వ్యాపారాలకు అనుమతి ఇస్తూ అద్దె వసూలు చేయ డం సరికాదని అంటున్నారు.

ఆక్రమణదారులను ఉపేక్షించం

- జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ప్రసాద్

జీవీఎంసీ 30వ వార్డు టర్నర్ చౌల్ట్రీ మెయిన్ రోడ్డు పెట్రోల్ బంకు ఎదురుగా రహదారిని ఆక్రమించిఫుట్‌పాత్ వ్యాపారం నిర్వహించేవారి విషయంలో ఉపేక్షించేది లేదు. గతంలో మునిసిపాలిటీ స్థలాన్ని ఆక్రమించి వ్యాపారం చేస్తున్నట్టు టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్ధారిస్తే తక్షణం దుకాణాలను తొలగిస్తాం.

ఇసుక కుప్పలు తొలగించరూ..



టీపీటీ కాలనీలో రహదారికి అడ్డంగా ఉన్న ఇసుక

సీతమ్మధార, ఆగస్టు 5: గ్రేటర్ 24వ వార్డు టీపీటీ కాలనీలో భవన నిర్మాణానికి సంబంధించిన ఇసుక కుప్పలను రోడ్డుపై వేసి వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. క్రిసెంట్ టవర్స్ వెనుక రోడ్డు అభయాంజనేయ స్వామి ఆలయం ఎదుట గల ఈ రహదారిలో ఓ ఇంటి నిర్మాణ యజమాని ఇసుక కుప్పలుగా వేసి వాటిపై గోనె సంచులతో కప్పి ఆక్రమించారు. దీంతో అటుగా రాకపోకలు సాగించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సుమారు 20 అడుగుల ఎత్తున ఇసుకనిల్వ చేయడంతో నడవడానికి సైతం సమస్యగా మారింది. దీంతో వాహనదారులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. జీవీఎంసీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా స్పందించి ఇసుక కుప్పలు తొలగించాలని కోరుతున్నారు.

తెలుకుల, గాండ్ల వర్గాలకు తోడ్పాటునందించాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

మహారాణిపేట, ఆగస్టు 5: గాండ్ల, తెలుకల సామాజిక వర్గం ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పెబ్బిలి రవి కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మహారాణిపేట దండుబజారు వద్ద ఉన్న గాండ్ల సామాజిక వర్గ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఢిల్లీలో అఖిల భారత తెలిసాహు మహాసభ జాతీయ సమావేశానికి రాష్ట్ర ప్రతినిధిగా హాజరైనట్టు చెప్పారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో గాండ్ల సామాజిక వర్గ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరామన్నారు. రాజకీయంగా నామినేటెడ్ పదవులు తమకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు దాడి సత్యనారాయణ, కన్వీనర్ ఎన్నేటి తాతారావు, చిత్రాడ అప్పా రావు, పేరూరి గణేశ్వరరావు, ఎన్నేటి సన్యాసిరావు, లక్ష్మణకుమార్ సతీష్ పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలి

- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి



ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ పీవో జయదేవి, అంగన్‌వాడీలు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నవజాత శిశువులకు ఆరు నెలలపాటు తల్లిపాలను తప్పనిసరిగా అందించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వి. జయదేవి పేర్కొన్నారు. సోమవారం ఆశీల్‌మెట్ట వద్ద అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలనుద్దేశించి మాట్లాడారు. తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగు తుందన్నారు. అనంతరం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. ఇందిరాదేవి, మెడికల్ ఆఫీసర్ మనోరమ, హెచ్‌వీ పూర్ణకుమారి, సచివాలయ ఎం ఎస్‌కేలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విశాఖపట్నం: తల్లిపాలపై అపోహలు విడాలని ఘోషాసుపత్రి వైద్య నిపుణులు సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆస్పత్రిలో బాలింతలు, నర్సింగ్ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్‌ఎంవో డాక్టర్ రాధారాణి, చిన్నపిల్లల వైద్యనిపుణులు చంద్రశేఖర్, నర్సింగ్ సిబ్బంది, బాలింతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండ్లను పంపిణీ చేశారు.

మాధవధార; గ్రేటర్ 49వవార్డు పట్టాభిరెడ్డితోట సత్యానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్త రేణుక మాట్లాడుతూ. పోషకాహారం తీసుకోవడంపై శ్రద్ధ వహించాలని గర్భిణులు, బాలింతలకు సూచించా రు. కేంద్రంలో ఈ సమావేశం అనంతరం కాలనీలో బ్యానర్లు ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అర్బన్-1 ప్రాజెక్టు సూపర్‌వైజర్, పలు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచరపాలెం: గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన అవసరమని అర్బన్ ఐసీడీఎస్ సీడీపీవో రమణికుమారి అన్నారు. 48వ వార్డు జైప్రకాశ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీపేట హెల్త్ సెంటర్ వైద్యాధికారి గౌతమితోపాటు సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



సత్యానగర్‌లో అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీలు, స్థానికులు



కంచరపాలెం జైప్రకాశ్‌నగర్‌లో మాట్లాడుతున్న వైద్యాధికారి

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

... 5వ పేజీ తరువాయి

గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నామినేషన్లు దాఖల సమయంలో అభ్యర్థిని పది మంది బలపర్చాల్సి ఉంటుందని, ఎన్నికల ఖర్చుపై ఎటువంటి పరిమితులు లేవన్నారు. ఎన్నికల కోడ్ అమలుకు తహసీల్దారు నేతృత్వంలో మండల స్థాయిలో కమిటీలు వేశామన్నారు. రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు వేశామని ఆయన వివరించారు.

ఎక్స్‌అఫీషియో సభ్యులుగా పేర్ల నమోదుకు వైసీపీ నేతల దరఖాస్తు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా తమ పేర్లు నమోదు చేయాలని వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, నిరంజనరెడ్డి కోరారు. ఈ మేరకు ముగ్గురూ దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ముగ్గురు ఎంపీలు జీవీఎంసీలో ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉన్నారు. దరఖాస్తులు పరిశీలించిన తరువాత అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు.

కేజీహెచ్‌లో హైడ్రామా

... 5వ పేజీ తరువాయి

మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ ఆస్పత్రి పరిపాలనా విభాగానికి వచ్చారు. సూపరింటెండెంట్ కార్యాలయంలోకి వెళ్లి తాను బాధ్యతలు తీసుకుంటానంటూ ప్రస్తుత సూప రింటెండెంట్ శివానందకు తెలిపారు. ఇరువురు సుమారు అర్ధగంటపాటు లోపల చర్చించుకున్నారు. అయితే, డీఎంఈ కార్యాలయం నుంచి తనకు ఎటువంటి ఆదేశాలు రాలే దంటూ శివానంద్ వెల్లడించారు. రీ పోస్టింగ్ ఆర్డర్స్ ఉంటే చూపించాలని కోరారు. రీ పోస్టింగ్ ఆర్డర్స్ తనకు రాలేదని, అయితే ఉన్నతాధికారులుమాత్రం బాధ్యతలు తీసుకోవాలని చెప్పినట్టు అశోక్ కుమార్ వెల్లడించారు. మౌఖిక ఆదేశాల ప్రకారం తాను బాధ్యతల నుంచి తప్పుకుంటే ఇబ్బందులు తలెత్తుతాయని శివానంద్ చెప్పగా, లిఖిత పూర్వక ఆర్డర్స్ వచ్చిన తరువాతే చేరతానంటూ అశోక్‌కుమార్ వెళ్లిపోయారు. సెలవులు ముగిం చుకుని వచ్చిన విషయం డీఎంఈకి ఆయన రిపోర్టు చేసినట్టు తెలిసింది. ఈ వ్యవ హారం ఆస్పత్రిలో చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే సూపరింటెండెంట్ పోస్టుపై డీఎంఈ స్థాయిలో నిర్ణయం జరిగిందని చెబు తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టమైన ఆదేశాలువచ్చే అవకాశం ఉందంటున్నారు. ఉన్నతాధికా రుల నుంచి ముందస్తు సమాచారం ఉండడం వల్లే డాక్టర్ అశోక్‌కుమార్‌కు వచ్చారా?, లేక ఇంకేదైనా కారణం ఉందా?...అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉందని చెబుతున్నారు.

లేఅవుట్లు ఖాళీ

... 5వ పేజీ తరువాయి

వేశారు. దరఖాస్తులు ఆహ్వానించారు. ప్లాట్లను 150 గజాలు, 200 గజాలు, 240 గజాలుగా విభజించారు. ప్రభుత్వ ఉద్యోగులు దరఖాస్తు చేసుకుంటే 20శాతం రాయితీతో ఇస్తామని ప్రకటించారు. విస్తృత ప్రచారం చేశారు. అయితే ఈ నాలుగు లేఅవుట్లలో కేవలం పాలవలస లేఅవుట్‌పైనే పలువురు ఆసక్తి చూపారు. ఇది అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిలో టోల్‌గేట్‌కు సమీపాన ఉండడంతో ఎక్కువ మంది మక్కువ చూపారు.

- పాలవలసలో 77.32 ఎకరాల విస్తీర్ణంలో 472 ప్లాట్లు వేశారు. చదరపు గజం ధర రూ.14,500 ఖరారు చేశారు. దరఖాస్తులు ఆహ్వానించారు. గడువు పెట్టారు. పెద్దగా ఆదరణ లేకపోవడంతో గడువు నిబంధన తొలగించారు. ఆసక్తి ఉన్నవారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రకటించారు. మొత్తంగా ఆ లేఅవుట్‌లో 164 ప్లాట్లను లాటరీ విధానంలో దరఖాస్తుదారులకు కేటాయించారు. ఇంకా 308 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి.
- రామవరం గ్రామంలో 119.33 ఎకరాల్లో 763 ప్లాట్లు వేశారు. చ.గజం ధర రూ.14 వేలు నిర్ణయించారు. అనేక సార్లు దరఖాస్తులు ఆహ్వానించినా పెద్దగా స్పందన లేదు. ఇప్పటివరకు కేవలం తొమ్మిది దరఖాస్తులే వచ్చాయి.
- గంగసాని అగ్రహారం-1లో 85.54 ఎకరాల్లో 618 ప్లాట్లు వేశారు. అక్కడ కూడా చ.గజం ధర రూ.14 వేలు నిర్ణయించారు. ఈ లేఅవుట్‌లో ప్లాట్లకు 16 మంది మాత్రమే దరఖాస్తు చేశారు.
- గంగసాని అగ్రహారం-2లో 42.2 ఎకరాల్లో 257 ప్లాట్లు వేశారు. అక్కడ చ.గజం రూ.14 వేలు ధర పెట్టారు. దీనికి మరీ ఘోరంగా నాలుగంటే నాలుగే దరఖాస్తులు వచ్చాయి.

పాలవలస తప్ప మిగిలిన మూడు లేఅవుట్లకు పెద్దగా ఆదరణ లేకపోవడంతో వాటిని అభివృద్ధి చేయకుండా అలాగే ఉంచేశారు. ఆ మూడింటికి వచ్చిన 29 మంది దరఖాస్తుదారులకు పాలవలసలో ప్లాట్లు కేటాయించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఆడ్ బిట్ల వేలంపై దృష్టిపెట్టిన అధికారులు ఆ తరువాత పాలవలసలో మిగిలిన ప్లాట్ల విక్రయానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నారు. అయితే ఈసారి దరఖాస్తులు ఆహ్వానించినప్పుడు రేట్లు పెంచకుండా పాత రేట్లకే ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులు కోరుతున్నారు. అలాగైతే తామంతా సంఘంగా ఏర్పడి తీసుకుంటామని అంటున్నారు.

హోరాహోరీగా స్థాయీ సంఘం పోరు

... 5వ పేజీ తరువాయి

ప్రాంతానికి తరలించి, బుధవారం ఉదయం అక్కడ నుంచి ఓటేసేందుకు నేరుగా జీవీఎంసీ కార్యాలయానికి తీసుకురావాలనే వ్యూహంలో వైసీపీ నేతలు ఉన్నట్టు తెలిసింది. మరోవైపు కూటమి ఎమ్మెల్యేలు, నేతలు స్టాండింగ్ కమిటీలో పదికి పది స్థానాలు గెలుపొందడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే వైసీపీ నుంచి టీడీపీలో చేరాలనే ఆసక్తితో ఉన్నవారిలో ఎవరిని తీసుకోవాలనే దానిపై సోమవారం జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావుతో చర్చించినట్టు తెలిసింది. కూటమికి చెందిన కార్పొరేటర్లను కూడా క్యాంపునకు తరలించే ప్రతిపాదన ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఏదిఏమైనా కూటమి, వైసీపీకి సమానబలం ఉండడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

ఏయూలో హాస్టల్ విద్యార్థుల ఆందోళన

... 5వ పేజీ తరువాయి

అనుమతించకపోవడంతో అక్కడే నిల్చుని నిరసన తెలిపారు. విద్యార్థుల ఆందోళనతో బయటకు వచ్చిన ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు వారితో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. వెంటనే హాస్టల్ వార్డెన్ ప్రొఫెసర్ హరనాథ్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఇకపై ఏదైనా సమస్య ఉంటే ముందు వార్డెన్ దృష్టికి తీసుకువెళ్లాలని, ఆ తరువాత తన దృష్టికి తీసురావాలన్నారు. ఇకపై భోజనం రుచిగా ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు. వీసీ సూచనలు మేరకు వార్డెన్ హరనాథ్ 15 మంది విద్యార్థులతో మెస్ కమిటీని ఏర్పాటుచేశారు. ఇకపై ఆ కమిటీ ఆధ్వర్యంలో మెస్ నిర్వహించబడుతుందన్నారు. సమస్య ఉంటే విద్యార్థులు మెస్ కమిటీతో చర్చించి అనంతరం వార్డెన్ దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు.

డీఎస్సీ, టెట్‌పై 7న ఉచిత అవగాహన సదస్సు

డాబాగార్డెన్స్, ఆగస్టు 5: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఎస్సీ, టెట్‌పై ఈ నెల 7న నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు కో ఆర్డినేటర్ సతీష్ తెలిపారు. కోచింగ్ నిపుణులు కె.ఎస్. లక్ష్మణరావు, మరికొందరు నిష్ణాతులు పాల్గొని బోధిస్తారన్నారు. ఈ సదస్సులో మనోవిజ్ఞాన శాస్త్రం మెటీరియల్ ఉచితంగా అందిస్తామన్నారు. ఇతర వివరాలకు ఫోన్ 93472 05549ను సంప్రదించాలని కోరారు.

విశాఖలో అదృశ్యమై..ఏజెన్సీలో విగతజీవిగా మారి..

- అనుమానాస్పద స్థితిలో కంచరపాలేనికి చెందిన యువకుడి మృతి



మృతిచెందిన చంద్రకాంత్ (ఫైల్)

కంచరపాలెం/ డుంబ్రిగుడ, ఆగస్టు 5: వారం కిందట అదృశ్యమైన కంచరపాలెం పరిధి జై ప్రకాశ్‌నగర్‌కు చెందిన యువకుడు అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం జాముగుడలో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది కనిపించాడు. ఈ కేసుకు సంబంధించి వివరాలివి.. జై ప్రకాశ్‌నగర్‌కు చెందిన బంగారి కోటేశ్వరరావు, ఈశ్వరి దంపతుల కుమారుడు చంద్రకాంత్ జూలై 30వ తేదీ నుంచి కనిపించలేదు. ఈ నేపథ్యంలో తండ్రి కోటేశ్వరరావు ఇటీవల కంచరపాలెం, డుంబ్రిగుడ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ఈ క్రమంలో డుంబ్రిగుడ మండలం కొర్రాయి పంచాయతీ జాముగుడ పొలం గెడ్డ వాగులో ఓ యువకుడు మృతి చెందినట్లు సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో క్లూస్ టీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మృతదేహం తమ కుమారుడిదిగా తండ్రి కోటేశ్వరరావు గుర్తించారు. అయితే, చంద్రకాంత్ అరకు తన స్నేహితులతో కలిసి పిక్నిక్‌కు వెళ్లినట్టు సమాచారం. డుంబ్రిగుడ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రుద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

కుష్ఠుశరణాలయం వార్షికోత్సవం

డాబాగార్డెన్స్, ఆగస్టు 5: డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలోని కుష్ఠు శరణాలయం 70వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ దిలీప్‌కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రేమ సమాజం వారు మిగిలిన సేవలన్నింటికంటే కుష్ఠు రోగులకు ఆశ్రయం కల్పించి వారి సేవలందించడం గొప్ప విషయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ సమాజం అధ్యక్ష, కార్యదర్శులు బుద్ధ శివాజీ, హరిమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వారికి దుస్తులు పంపిణీ చేశారు.

కనకమహాలక్ష్మికి ఎమ్మెల్యే పూజలు



అమ్మవారికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పూర్ణామార్కెట్, ఆగస్టు 5: శ్రావణ మాస ఉత్సవాలు పురస్కరించుకుని దక్షిణ నియోజవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు. అర్చకులు ఆల యమర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. శ్రావణలక్ష్మిగా కొలువుతీరిన అమ్మవారికి పసుపు, కుంకుమలు మంగళహారతులిచ్చిపూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి. ఉమామహేశ్వరరావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆకతాయిలతో బాలికలకు ఇక్కట్లు

భీమునిపట్నం, ఆగస్టు 5 : పట్టణంలో కళాశాలలు, ఉన్నత పాఠశాలల వద్ద ఆకతాయిల చేష్టల వల్ల బాలికలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యా సంస్థల ప్రారంభ సమయంలోనూ, ఇంటర్వెల్ సమయంలోనూ, విడిచిపెట్టే సమయంలోనూ ఆకతాయిల మూకలు అక్కడికి చేరి నానా యాగీ చేస్తున్నారు.కొందరు బైక్‌లపై వచ్చి అటు, ఇటు తిరుగుతూ సైరన్లతో పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారు. ముఖ్యంగా వసతి గృహాల నుంచి బాలికలు పాఠశాలలు, కళాశాలలకు వచ్చే సమయంలోనూ, వెళ్లే సమయంలోనూ ఏకవచనాలతో సంబోధించడం, అసభ్యకర పదాలతో మాట్లాడుతుండడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ విషయమై ఆయా విద్యా సంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వారి వైఖరి మారడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి విద్యా సంస్థలను విడిచిపెట్టే సమయంతో పాటు మిగిలిన వేళల్లోనూ నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కప్ప స్తంభం ఆదాయం రూ. 6. 6 లక్షలు

సింహాచలం, ఆగస్టు 5 : కప్ప స్తంభం ఆలింగనాల ద్వారా అప్పన్న స్వామి ఖజానాకు సుమారు రూ.6.64 లక్షల ఆదాయం సమకూరింది. గత నెలలో 26900 మంది భక్తులు దేవస్థానం నిర్ణయించిన రూ.25 చెల్లించి కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకోవడం ద్వారా మొత్తం రూ.6,64,975 లక్షల ఆదాయం స్వామివారి ఖజానాకు లభించినట్టు దేవస్థానం అధికారులు వెల్లడించారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, ఆగస్టు 5 : వరాహలక్ష్మీనృసింహస్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్ర నామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక్కొక్కటి చొప్పున పవిత్ర తులసీ దళాలతో పూజ చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

కృష్ణాపురంలో తల్లి పాల వారోత్సవాలు

పద్మనాభం, ఆగస్టు 5 : కృష్ణాపురంలోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాజానకి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యకరం అన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వల్ల వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

ఆహార కల్తీని అరికట్టాలి : బీజేపీ

విశాఖపట్నం, ఆగస్టు 5 : ఆహార కల్తీని అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కోరారు. సోమవారం ఆయన నగరంలోని పార్టీ కార్యాలయంలో విలే కరులతో మాట్లాడారు. ఫుడ్ తనిఖీలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మూడు టెస్టింగ్ ల్యాబ్స్ మంజూరు చేసిందని, అందులో ఒకటి ఈఎన్‌టీ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేశారని చెప్పారు. అయితే అది పూర్తిస్థాయిలో పని చేయడం లేదన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసు కువెళ్లినట్టు తెలిపారు.

చేనేత కార్మికులకు ప్రోత్సాహం

విశాఖపట్నం, ఆగస్టు 5 :ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి, కార్మికులను ప్రోత్సహించాలని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా స్పెషల్ ఇన్విటీస్ ప్రేమకుమారి, ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. సోమవారం వారు నగరంలోని పార్టీ కార్యాలయంలో పలు రకాల చేనేత వస్త్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం జాతీయ చేనేత వస్త్ర దినోత్సవం పురస్కరించుకుని ఆ రోజు చేనేత కార్మికులను అభినందిస్తూ సన్మానం చేయనున్నట్టు చెప్పారు.

సినిమా గైడ్

- **శివం భజే :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 28, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 58, బెండకాయలు 20, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 44, బీరకాయలు 42, ఆనపకాయలు 17, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 30, క్యారెట్ 32, దొండకాయలు 30, బంగాళదుంపలు 34, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 150, బరబటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 40, దోసకాయ 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 80, పొటల్స్ 28, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	77
ఫారం ధర	--	97
విత్ స్కిన్	--	164
స్కిన్‌లెస్	--	174

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ I లో..



ఆర్‌టీసీ బస్ డిపో మార్గంలో గుంతలు పడిన రోడ్డు



ఇటీవల పడిన వర్షాలకు గోతుల్లో చేరిన నీరు



రాళ్లు తేలిన రహదారి

అధ్వాన రోడ్లతో అవస్థలు

- 8, 15, 16 వార్డుల్లో గోతులు పడిన రహదారులు
- రాకపోకలకు స్థానికుల ఇబ్బందులు
- వర్షం పడితే మరింత నరకం
- ఏళ్ల తరబడి మరమ్మతులు శూన్యం

మధురవాడ/వెంకోజీపాలెం, ఆగస్టు 5 : జీవీఎంసీ 8వ వార్డులోని మిథిలాపురి వుడా కాలనీకి ఆనుకొని ఉన్న కొన్ని రహదారులు ప్రజలకు నిత్యం నరకం చూపిస్తున్నాయి. అడుగడుగునా గోతులతో రాళ్లు తేలి ఉండడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే కనీసం వాటిపై నడిచి వెళ్లే పరిస్థితి కూడా లేదు. 7వ వార్డు సరిహద్దు వరకు కొన్ని సిమ్మెంటు రోడ్లు కాగా 8వ వార్డులో మాత్రం పూర్తిగా మట్టి రోడ్లే ఉన్నాయి. ఆర్‌టీసీ డిపో వద్ద ఉన్న రోడ్డు శిథిలమై రాళ్లు తేలిపోయింది. మొగధారమ్మ ఆలయానికి వెళ్లే రహదారి గోతులు పడి ఉండడంతో వర్షం పడితే వాటిలో నీరు చేరి వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రత్నా ఆర్కేడ్, తదితర అపార్టుమెంట్లకు వెళ్లే రహదారులు కూడా అధ్వానంగా ఉండడంతో ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు నిత్యం నరకయాతన పడుతున్నారు.ఈ ప్రాంతంలో ఆర్‌టీసీ సిబ్బందితో పాటు ఐటీ కంపెనీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పనిచేసే ఉద్యోగులు ఎక్కువగా నివసిస్తున్నారు. వారంతా విధుల నిర్వహణకు ఈ రోడ్లపైనే ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే 15, 16వ వార్డులకు మధ్య ఉన్న పాతవెంకోజీపాలెం ప్రధాన రహదారి కూడా అధ్వానంగా ఉంది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు.రోడ్డు మొత్తం గోతులతో నిండిపోయింది. ఎన్నికలకు ముందు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పునర్నిర్మాణానికి జీవీఎంసీ సిబ్బంది గోతులు తవ్వి పూడ్చకుండా వదిలేశారు. 16వ వార్డులోని కేఆర్ఎం కాలనీ, సీఎంఆర్ శ్మశాన వాటిక, శివాలయం ప్రాంతాల్లోని ప్రధాన రహదారిని కూడా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పునర్నిర్మాణంలో భాగంగా తవ్వి పైపులైను వేసి అసంపూర్ణంగా వదిలేశారు. దీంతో ఆయా రోడ్లపై రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడడమే కాకుండా గోతుల వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న ఈంత వీధి ప్రధాన రహదారి

ప్రజలకు ఉపయోగకరంగా వలంటీర్ల వ్యవస్థ : ప్రణవ్

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 5 : కూటమి ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను ప్రజా ఉపయోకరంగా మారుస్తుందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్‌గోపాల్ అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వం వలంటీర్లతో దందాలు, దారుణాలు, అరాచకాలు చేయించిందని విమర్శించారు. కానీ కూటమి ప్రభుత్వం వారి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుందని చెప్పారు.

కిచెన్ గార్డెన్ స్థలం పరిశీలన



కిచెన్ గార్డెన్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పద్మనాభం, ఆగస్టు 5 : పద్మనాభంలోని కిచెన్ గార్డెన్ స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాజానకి చెప్పారు. ఆరేళ్లుగా నిరుపయోగంగా కిచెన్ గార్డెన్ స్థలం అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వచ్చిన కథనానికి ఆమె స్పందించారు. ఈమేరకు సిబ్బందితో కలిసి కిచెన్ గార్డెన్ స్థలాన్ని పరిశీలించారు. స్థలం కేటాయింపునకు సంబంధించిన పత్రాల గురించి తహసీల్దార్ కార్యాలయంలో ఆరా తీశారు. సంబంధిత పత్రాలను పరిశీలించి కిచెన్ గార్డెన్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఆమె తెలిపారు.

కృష్ణ కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు



విద్యార్థులకు ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్న బెటాలియన్ అధికారులు

మద్దిలపాలెం, ఆగస్టు 5 : డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌సీసీలో చేరేందుకు విద్యార్థులకు సోమవారం శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. 36 ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపికకు సుమారు 200మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారికిబెటాలియన్‌కి చెందిన సుజాన్‌సింగ్ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, సన్యాసిరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

విద్యార్థి ఫిర్యాదుపై స్పందించిన ఇన్‌చార్జి వీసీ



రోడ్డుపై గోతులను పూడ్చిన దృశ్యం

వెంకోజీపాలెం, ఆగస్టు 5 : సమతా లా హాస్టల్ వద్ద గతంలో రోడ్డును తవ్వి మురుగు నీటి వ్యవస్థను ఏర్పాటు చేసిన వర్సిటీ అధికారులు తిరిగి రోడ్డును సరిగ్గా పునరుద్ధరించలేదని ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావుకు విద్యార్థి కొండేటి సోమశేఖర్ వాట్సాప్ ద్వారా సోమవారం ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన వీసీ ఇంజనీరింగ్ విభాగాధికారులను తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన రోడ్డును పునరుద్ధరించారు. ఫిర్యాదుపై వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన వీసీకి ఆ విద్యార్థి వాట్సాప్ ద్వారా కృతజ్ఞతలు తెలియజేశారు.

మురుగు నీటితో అవస్థలు

వెంకోజీపాలెం, ఆగస్టు 5 : జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతం నుంచి పాతవెంకోజీపాలెం వరకు ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోల్ పొంగి మురుగు నీరు వరదలా ప్రవహిస్తోంది. దీంతో పాదచారులు, వాహనదారులు అందులోనే రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం ఈ సమస్య నెలకొంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే పాత వెంకోజీపాలెంలోని రామాలయం వెనుక మార్గంలో ఉన్న మ్యాన్ హోల్ కూడా పొంగిపొర్లుతోంది. అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పొంగి పొర్లుతున్న మురుగు నీరు



జిగ్మా ప్రతినిధులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

జిగ్మా ప్రతినిధులతో కమిషనర్ సమావేశం

కొమ్మాది, ఆగస్టు 5 : డంపింగ్ యార్డుకు తరలించిన చెత్తను త్వరగా క్లియర్ చేయగలిగితే స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 పోటీల్లో నగరానికి మంచి ర్యాంకింగ్ వస్తుందని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన కాపులుప్పాడ డంపింగ్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డులో జిగ్మా సంస్థ నిర్వహిస్తున్న బయో మైనింగ్ ప్లాంటును పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఎప్పటి చెత్తను అప్పుడు బయో మైనింగ్ చేయడం ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ మొదటి స్థానం సాధించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, జోన్ -2 జడ్సీ శైలజావల్లి, ప్రధాన వైద్యాధికారి నరేష్, ఈఈ మెకానికల్ దిలీప్, కిశోర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వినతి

ఆనందపురం, ఆగస్టు 5 : ఆనందపురం పంచాయతీలో జగనన్న కాలనీ ఇళ్ల మంజూరులో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ టీడీపీ నాయకులు తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు మీసాల సత్యన్నారాయణ మాట్లాడుతూ ఆనందపురం రెవెన్యూ సర్వే నెంబరు 276, 305, 306లో ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా సుమారు 150 వరకు దురాక్రమణకు గురయ్యాయని ఆరోపించారు. దీనిపై అప్పటి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవల్సిందిగా వీఆర్‌ఓను ఆదేశించారని, అయినా ఎటు వంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి దర్యాప్తు జరపాలని కోరారు.

వెంకన్న ఆలయంలో శ్రావణ మాస పూజలు



సింహాచలం, ఆగస్టు 5 : కొండ దిగువన అప్పన్నస్వామి పూదోటలో కొలువైన అలిమేలు మంగా, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి సోమవారం నుంచి శ్రావణ మాస కుంకుమార్చనలు ప్రారంభమయ్యాయి. ఈఓ శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు ఈనెలలో ప్రతిరోజూ ఉదయం 7.30 నుంచి 11.30 వరకు అష్టోత్తర కుంకుమార్చనలు జరుగుతాయి. రూ.300 చెల్లించిన భక్తుల గోత్రనామాలతో పూజ చేస్తారు. అలాగే నాలుగు శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి 10.30 వరకు నిర్వహించే లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చనలో పాల్గొనేవారు రూ.300 చెల్లించి టికెటు తీసుకోవాల్సి ఉంది. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఓ కోరారు.

కొమ్మాది : అన్నంరాజునగర్‌లో ఉన్న అష్టలక్ష్మీ దేవాలయంలో శ్రావణ మాస పూజలు ప్రారంభమయ్యాయి. వేకువజామున లక్ష్మీనారాయణులకు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి, వెండి కవచధారణ నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు లోక కళ్యాణార్థం అష్టలక్ష్మీ హోమం నిర్వహించారు. అలాగే వైశాఖేశ్వర స్వామికి రుద్రాభిషేకం నిర్వహించి, పూజలు జరిపారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో లక్ష్మీనారాయణులను దర్శించుకున్నారు.

చిరు వ్యాపారుల సమావేశం

కొమ్మాది, ఆగస్టు 5 : చిరు వ్యాపారుల మధ్య ఐక్యత లేకపోవడం వల్లే ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయని చికెన్, మటన్ వ్యాపారులు పేర్కొన్నారు. సోమవారం పీఎంపాలెం ఉస్మానియా ముస్లిం కాలనీలో ఈద్గా వద్ద నగరంలోని చికెన్, మటన్ వ్యాపారులు సమావేశమయ్యారు.ఈ సందర్భంగా హేక్ హుస్సేన్, షేక్ యాసిన్ మాట్లాడుతూ వ్యాపారులంతా సమష్టిగా ముందుకు వెళ్తే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈమేరకు కమిటీ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ఉస్మానియా ముస్లిం కాలనీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రెహమాన్, టీడీపీ మైనారిటీ సెల్ నాయకులు అబ్దుల్ బాషా, షేక్ అత్తాఫ్, షేక్ మదీనా, షేక్ అక్తర్, ఎస్‌కే నాగూర్, తదితరులు పాల్గొన్నారు.

కాలబైరవ స్వామి ఆలయంలో అమావాస్య పూజలు

వెంకోజీపాలెం, ఆగస్టు 5 : కొత్త వెంకోజీపాలెం శివాలయంలో వేంచేసి ఉన్న కాలబైరవ స్వామి ఆలయంలో భక్తులు సోమవారం అమావాస్య పూజలు నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి ప్రకాష్‌శర్మ, బాల భాస్కర శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి భక్తుల గోత్రనామాలతో స్వామివారికి పూజలు చేసి, అభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీల కనకరాజు, మాజీ అధ్యక్షుడు డాక్టర్ బోర వెంకటరమణారెడ్డి, కాళ్ల వరహాలు, కాళ్ల శంకర్, బోర ధనరెడ్డి, కామేష్, వీర వెంకట అప్పారావు, ఎర్రాజీ రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

మద్దిలపాలెం, ఆగస్టు 5 : యాదవ విద్యార్థులకు ఈనెల 25న ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్టు యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డొక్కర శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం ఆయన శివాజీపాలెంలోని ఆ సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది టెన్త్‌లో 500 మార్కులకు పైగా, ఇంటర్‌లో 900 మార్కులకు పైగా వచ్చిన వారు 18లోగా 8143446565 ఫోన్ నంబర్‌కు కాల్ చేసి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఘనంగా రచయిత మున్షి ప్రేమ్‌చంద్ జయంతి

మద్దిలపాలెం, ఆగస్టు 5 : డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మున్షి ప్రేమ్‌చంద్ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ ప్రేమ్‌చంద్ హిందీ, ఉర్దూ భాషల్లో చేసిన పలు రచనలు భారతీయ గ్రామీణ జీవన విధానానికి దర్పణంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పి. జయ, శ్రావన్‌కుమార్, కె. రవిబాబు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



రైతు బజారు ఎదురుగా డబుల్ రోడ్డులో వంగిపోయిన ఇనుప కంచె

అధికారులూ.. కాస్తా ఇటు చూడండి !

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 5 : ఎంవీపీ రైతుబజారు ఎదురుగా డబుల్ రోడ్డు మధ్య విభాగినిపై ఇనుప రక్షణ కంచె పూర్తిగా ధ్వంసమయ్యింది. గతంలో ఏదో వాహనం ఢీకొనడంతో అది పూర్తిగా వంగిపోయింది. అప్పటి నుంచి దాన్ని అలాగే వదిలేశారు. ఇదే రహదారిలో నాలుగు రోడ్ల కూడళ్ల వద్ద బ్యూటిఫికేషన్ పేరిట రూ. లక్షలు వెచ్చిస్తున్నారు. అలాగే వేగ నిరోధకాలు కూడా భారీగా సొమ్ము వెచ్చించి నిర్మించారు. కానీ ఇక్కడ మాత్రం మరమ్మతులు చేయడం లేదు. రైతు బజారుకు వెళ్లి వచ్చే వాహనాలు ఇక్కడే మలుపు తిరుగుతాయి. ఇలాంటి చోట వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దడానికి ఎక్కడికక్కడ హంగులు ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమే అయినా, ఇలాంటి విషయాల్లో కూడా వెంటనే స్పందిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఆరిలోవ పోలీస్ స్టేషన్



విమ్స్ ఆస్పత్రి ఆవరణలో నిర్మాణంలో ఉన్న భవనం

ఆరిలోవ, ఆగస్టు 5 : విమ్స్ ఆస్పత్రి ఆవరణలో నిర్మించిన ఆరిలోవ నూతన పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం ఈ స్టేషన్ ఆరిలోవలో ఇరుకైన భవనంలో కొనసాగుతోంది. దీంతో ఎస్ఐ, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిర్యాదుదారులు కూర్చోవడానికి కూడా వీలుకాని పరిస్థితి. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వం పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి విమ్స్ ఆస్పత్రి ఆవరణలో సుమారు ఎకరా స్థలాన్ని కేటాయించింది. అప్పటి హోం మంత్రి చిన రాజప్ప శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు నిధులు కేటాయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పనులను అసంపూర్తిగా వదిలేశారు. కూటమి అధికారంలోకి రావడంతో హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు స్టేషన్ భవన నిర్మాణానికి అదనంగా రూ. 20 లక్షల కేటాయించారు. భవన నిర్మాణం తుది దశకు చేరడంతో రంగులు వేస్తున్నారు. ఆగస్టు 15న నూతన భవనాన్ని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు సీఐ గోవిందరావు తెలిపారు.

కళా విహీనంగా గ్రీన్ బెల్ట్



డివైడర్ మధ్యలో కానరాని మొక్కలు

మధురవాడ, ఆగస్టు 5 : జీవీఎంసీ 7వ వార్డులోని వుడా రోడ్డు నుంచి ఐటీ సెజ్ వరకు వీఎంఆర్‌డీఏ గ్రీన్ బెల్ట్ మొక్కలు లేక కళా విహీనంగా కనిపిస్తోంది. వంద అడుగుల వెడల్పుతో రహదారి ఏర్పాటు చేసి డివైడర్‌లో మట్టి ఫిల్లింగ్ చేసి మొక్కలు నాటారు. మిథిలాపురి వుడా రోడ్డులో కొంతవరకు మొక్కలు ఏపుగా పెరిగాయి. వుడా రోడ్డు చివరి నుంచి ఐటీ సెజ్ వరకు రహదారి మధ్య ఉన్న ఖాళీ స్థలాన్ని గ్రీన్ బెల్టుగా ప్రకటించినా, ఒక్క మొక్కా లేదు. కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న మధురవాడ పరిసరాల్లో పచ్చని మొక్కలు నాటడానికి స్థలం కరువవుతోంది. ఈ క్రమంలో కేవలం మొక్కలు నాటడానికి, పచ్చదనం పరిరక్షణకు మినహాయించిన డివైడర్‌లోనూ మొక్కలు లేక ఆ స్థలం కూడా కళావిహీనంగా కనిపిస్తోంది.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు : ఏఓ



వీఆర్‌ఓలకు ఈ-పంట నమోదుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ చలం

పద్మనాభం, ఆగస్టు 5 : కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీకి వీఆర్వోలు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆనంద కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఈ-పంట నమోదుపై వీఆర్వోలకు శిక్షణ ఇచ్చారు. అలాగే కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీకి సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఎంవీఎస్ చలం మాట్లాడుతూ వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సహాయకులు కలిసి ఈ-పంటను నమోదు చేయాలన్నారు. వరి వేసిన ప్రతి రైతు పేరు నమోదు చేయాలని, రైతులు పంట వేసిన సర్వే నెంబర్ల వివరాలను ముందుగా వ్యవసాయ సహాయకులకు వీఆర్వోలు అందజేయాలని చెప్పారు. అలాగే అర్హులైన కౌలు రైతులకు బ్యాంకు రుణాలు, రాయితీ ఎరువుల మంజూరుకు సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీటీ యోగి, ఆర్ఐ కోటి, పలు గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

భీమునిపట్నం, ఆగస్టు 5 : విద్యార్థులను క్రమశిక్షణతో పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై కూడా ఉందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సూర్యప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించడానికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందన్నారు. వాటిపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండడంతో పాటు విద్యార్థులు ఇళ్లకు వచ్చాక శ్రద్ధగా చదువుకునేలా వాతావరణం కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో అధ్యాపకులు మాధవరావు, సింహాద్రప్పుడు, అప్పన్నబాబు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వేణుగోపాలరావు, బాలుర, బాలికల వసతి గృహాల వార్డెన్‌లు, తదితరులు పాల్గొన్నారు.